

# విశ్వసూక్తము

## విశ్వశాంతి సమైక్యతా శంఖారావం

**సంపుటి : 10** **జూన్ - 2019** **సంచిక : 4**

వ్యవస్థాపక సంపాదకులు : **శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్**

ప్రధాన సంపాదకులు : **శ్రీ కె.వి.ఆర్. సూర్యారావు**

గౌరవ సంపాదకులు : **శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు, శ్రీ యమ్.వి. ఆర్. శాస్త్రి**

సంపాదక వర్గము : **శ్రీ కె. వెంకట శివయ్య, శ్రీ పి.ఆర్. రావు, శ్రీ కె.కె. గుప్త,**

**శ్రీ పి.వి. రమణరావు,** ఆంధ్రభూమి ప్రతినిధి


**ఈ సంచికలో ...**


| | |
|---|---|
| సంపాదకీయం | 6 |
| 25-5-2019 నాడు షిరిడి సాయిబాబా మందిరం (లోయర్ టాంకుబండ్, హైదరాబాదు) 23వ వార్షికోత్సవ సందర్భంలో స్వామి దివ్యసందేశం | 8 |
| వేదాంతకథాస్రవంతి | 13 |
| శ్రీ వాసుదేవానంద సరస్వతీ (టెంబే స్వామి) సద్గురు చరిత్ర | 14 |
| కథా సూక్తము | 31 |
| సత్యసాయి విశ్వశాంతిదాయి | 32 |
| స్త్రీ సూక్తము | 34 |
| విశ్వహృదయార్చన | 37 |
| ఆత్మబంధువు | 42 |
| ఉద్ధవగీత | 47 |
| గీతమంజరి | 50 |



సంవత్సర చందా : రూ. 100/- మాసపత్రిక వెల : రూ. 10/-

Edited, Printed & Published by Sri K.V.R. Surya Rao on behalf
Viswamanava Samaikyata Samsat, Viswamandiram,
3rd Line, Krishnanagar, Guntur - 522 006. (A.P.) INDIA
from G - 2, Orchids, D.D.Colony, Hyderabad - 500 007
and Printed at Sri Lakshmi Graphics, 1-8-436, St No. 10, Chikkadpally,
Hyderabad-500 020. Ph : 040-6666 2976

**మా వివాహ వార్షికోత్సవ సందర్భంగా**

**భగవాన్**

**శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ వారి**

దివ్యాశీస్సులు అర్థిస్తూ వారి చరణ కమలాలకు
వినమ్ర భక్తి పూర్ణ హృదయాలతో
నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాము.

**వంకదార సుజాత**
**వంకదార గోపాలకృష్ణమూర్తి**
నంద్యాల, కర్నూలు జిల్లా

**(జూన్ 24, 2019)**

# జ్ఞానసూక్తమ్



**బ్రహ్మణ్యాధ్యాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥**

– భగవద్గీత అధ్యాయం 5, శ్లోకం 10

పరబ్రహ్మను గూర్చి అధ్యయనం చేస్తూ కర్మ ఫలాలను పరబ్రహ్మకే అర్పిస్తూ కర్మలతో ఎటువంటి సాంగత్యము లేకుండా తన ధర్మాన్ని నిర్వర్తిస్తూ ఉండే వ్యక్తిని తామరాకుపై నీటి బిందువు అంటుకొనని విధంగా పాప కర్మలు అంటుకొనవు.

కర్మచేయని మనిషి ఉండడు. తను చేస్తున్న కర్మలు పాప కర్మలు కావచ్చు లేక పుణ్యకర్మలు కావచ్చు. ఎటువంటివైనా వాటి ఫలాలను మనిషి అనుభవించక తప్పదు. కాని శ్రీ కృష్ణభగవానుడు ఈ పైన ఉదహరించిన భగవద్గీత శ్లోకంలో ప్రతి వ్యక్తి తానొనరించే కర్మలతో ఎటువంటి సంబంధం పెట్టుకోకుండా, తన ధర్మాన్ని నిర్వర్తిస్తూ వాటి ఫలాలను పరబ్రహ్మకే అర్పించినట్లైతే తన పాపకర్మలు తనను అంటుకొనవని బోధిస్తున్నాడు. అందుకనే పలువురు యోగులు ప్రతీ కర్మ అనంతరం 'కృష్ణార్పణం' అనడం పరిపాటి.

## సంపాదకీయం

# బాధ్యత

**– పి.వి. రమణరావు**

2019 జూన్ 5న అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నాం. గ్రామీణ స్థాయి నుండి మొదలుకుని రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలో సమావేశాలు, సదస్సులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని కాలుష్య నివారణ మండళ్ల (పిసిబి) నేతృత్వంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణను గుర్తు చేసుకుంటూ ఒక్కరోజు కార్యక్రమాలు చేపడితే చాలదు. సమావేశాలకు, సదస్సులకు పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణ కోసం అనేక పనులు, కార్యక్రమాలు ఆచరణలో చేపట్టాల్సి ఉంటుంది. పర్యావరణ అనేది ప్రభుత్వ బాధ్యత. పర్యావరణ పరిరక్షణ అనగానే మనకు సంబంధం లేని అంశంగా చాలా మంది భావిస్తుంటారు. కాని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. ఈ విషయాన్ని అందరూ గుర్తించాలి.

మన సమాజంలో ఏం జరుగుతోందన్న అంశాన్ని ఒకసారి పరిశీలిద్దాం. పంచభూతాలైన గాలి, నీరు, భూమి, అగ్ని, ఆకాశాలను మనకు వీలైనంత ఎక్కువగా కలుషితం చేస్తున్నాం. వాహనాల వల్ల గాలి, శబ్ద కాలుష్యం విచ్చలవిడిగా జరుగుతోంది. పట్టణాలు, నగరాల్లో ఇది మరీ ఎక్కువగా ఉంటోంది. పేదలైనవారు సైకిళ్లతో పాటు ప్రజారవాణా వ్యవస్థలైన బస్సులను, రైళ్లను వాడుతుంటారు. వీరి వల్ల వాయుకాలుష్యం పెద్దగా జరగడం లేదు. మధ్యతరగతి వాళ్లు ద్విచక్రవాహనాలను, కాస్త ఆర్థికంగా ఉన్నవారు కార్లు, జీపులను వాడుతున్నారు. ధనికుల ఇళ్లలో ఎంతమంది ఉంటే అన్ని కార్లు ఉంటాయి. మరికాస్త ధనికులైతే ఒక్కొక్కరు రెండు, మూడు కార్లు కలిగి ఉంటారు. ఈ వాహనలన్నీ రోడ్లపైకి రావడం చాల వాయుకాలుష్యం, ధ్వని కాలుష్యం ఎక్కువగా జరుగుతోంది. ఈ విషయంలో ఎవరికివారు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలే తప్ప, ప్రభుత్వం కాని, మన చట్టాలు కానీ ఏమీ చేయలేవు.

పరిశ్రమల వల్ల, పట్టణీకరణ వల్ల మన దేశంలోని చెరువులు, కుంటలు, నదుల నీరు పూర్తిగా కలుషితం అవుతున్నాయి. గతంలో తాగునీటికి ఉపయోగించిన జలాశయాలన్నీ నేడు రసాయన పదార్థాలు కలవడంతో స్నానాలకు వాడేందుకు కూడా ఉపయోగపడని విధంగా కాలుష్యానికి గురవుతున్నాయి. తాగునీటిని అందిస్తున్న జలాశయాల్లో రసాయనాలు కలుస్తున్నాయి. గృహాల వ్యర్థాలు కలుస్తున్నాయి. హైదరాబాదులోని హుస్సేన్‌సాగర్ నీటిని గతంలో తాగేందుకు వాడేవారు. ఈ జలాశయం ఇప్పుడు పూర్తిగా కలుషితం అయిపోయి, కనీసం స్నానాలకు కూడా ఉపయోగపడని విధంగా తయారైంది. మూడుదశాబ్దాల క్రితం హైదరాబాదుకు తాగునీటిని అందించిన గండిపేట, ఉస్మాన్‌సాగర్ నీరు కూడా ఇప్పుడు కలుషితం అవుతోంది. హైదరబాదు ఒక్కటే కాదు దేశంలోని అన్ని నగరాలు, పట్టణాల పరిస్థితి ఇలాగే ఉంది.

వాతావరణ కాలుష్యం వల్ల ప్రపంచంలోని హిమాలయాలతో సహా మంచుపర్వతాలన్నీ కరిగిపోతున్నాయి. దాంతో సముద్రమట్టం పెరిగిపోతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సముద్రమట్టం పెరిగి తీరంలోని ముంబాయి విశాఖపట్నంతో సహా అనేక పట్టణాలు, నగరాలు సముద్ర గర్భంలో కలిసిపోయే అవకాశం ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఆకాశం కాలుష్యం కావడంతో ఓజోన్‌పొరకు హాని కలిగి ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగిపోతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే కొన్ని దశాబ్దాల తర్వాత 50 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రత పెరిగిపోతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పంచభూతాలైన భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశాలను రక్షించు కోవాలంటూ భగవాన్ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ గత మూడు దశాబ్దాలుగా ప్రపంచానికి చెబుతూనే ఉన్నారు. భారత్, అమెరికాతో సహా అనేక దేశాల అధిపతులకు ఈ మేరకు స్వామి లేఖలు కూడా రాశారు. పంచభూతాలను పరిరక్షించుకోవాలని స్వామి పదేపదే చెబుతున్నారు. స్వామి ఆదేశాలను మనం పాటిస్తున్నామా? అని ప్రశ్నించుకోవాలి. ఇళ్లలో ప్లాస్టిక్ సంచులను వాడటం మానేద్దాం. పంచభూతాలు కలుషితం కాకుండా, పర్యావరణ రక్షణకు మనవంతు ప్రయత్నం మనం చేద్దాం.

# 25-5-2019 నాడు షిరిడి సాయిబాబా మందిరం (లోయర్ టాంకుబండ్, హైదరాబాదు) 23వ వార్షికోత్సవ సందర్భంలో స్వామి దివ్యసందేశం

ప్రేమమూర్తులారా,

పరమ పవిత్రమైన ఆలయ ప్రాంగణం. సాయి సన్నిధి. ఇది ఒక వ్యక్తి యొక్క హృదయస్పందనతో, మనోభావనతో భక్తిపూర్వకమైన సమైక్య కృషితో ఏర్పడిన మందిరం. అది ఎవరన్నది చెప్పనక్కర లేదు. అర్థరాత్రి 12 గం॥ కు వచ్చాడు వినయకుమార్ తో కలిసి. అటువంటి సమయంలో నేను బయటకు రాను. ఒక దివ్యసంకల్పంతో ఇక్కడకు వచ్చి ప్రతిష్టాపన చేయడం జరిగింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఎన్నో సమస్యలు వచ్చాయి. సమస్యలు లేకుండా ఉండదు. కుటుంబంలో, జీవితంలో సమస్యలు ఉంటాయి. అవి లేకుండా ఉండాలి అని అనుకోకూడదు. సమస్యలను పరిష్కరించుకునే శక్తి నాకు ఉంది అని వాటిని ఆహ్వానించాలి. సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతూ విజయాన్ని సాధించడమే మనిషి యొక్క ధ్యేయం, లక్ష్యం కావాలి. ఏదైనా కావచ్చు, వ్యాపార రంగం కావచ్చు, విద్యారంగం కావచ్చు, వైద్యరంగం కావచ్చు, రాజకీయ రంగం కావచ్చు, ఆధ్యాత్మిక రంగం కావచ్చు. ఏ రంగమైనా, మీరు ఏ రంగంలో పని చేస్తున్న వ్యక్తులైనా ముఖ్య లక్షణం ఏమిటంటే మీకు ఆ రంగంలో ఉన్న జ్ఞానంతో సమాజానికి సేవ చేయడం. ముఖ్యంగా సమాజంలో శాంతి, భద్రతలను కలిగించడం. సమాజంలో అంతా ప్రశాంతంగా ఉండాలి, ప్రతి ఒక్క వ్యక్తి భద్రంగా ఉండాలి. తరవాత వాళ్ళంతట వాళ్ళే బాగుపడతారు. ఈ సమయంలో ఇది ఎందుకు చెప్తున్నానో జాగ్రత్తగా వినండి. ఇంటిలో కూడా సమస్యలుతప్పవు. భార్య కోప్పడిందని తిట్టుకుంటారా లేదు మీనాబజారుకు వెళ్లి చీర కొని తెస్తారు. తిట్టిన ఆమె సంతోషంతో కౌగలించుకుంటుంది. అలాగే జీవితంలో ఓర్పు చెంది సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు పోయి విజయాన్ని సాధించుకుంటూ పోవాలి.

శ్రీలంకలో గుడ్ ఫ్రైడే తరవాత ఈస్టర్ సండేనాడు చర్చిలో ప్రార్థన చేసుకుంటున్నారు. ఏమి జరిగిందో మీకు తెలుసు. కులం పేరుతో, మతం పేరుతో ఏమి జరుగుతోందో ఇది పనికిరాదు. అందుకనే సాయినాథుడి యొక్క అవతారం. సాయినాథుడు పరిపూర్ణమైన దత్తావతారం. దత్తశక్తి. విశ్వ వ్యాప్త మైనటువంటి ఆ విశ్వశ్రీశక్తి మానవాకారంలో సాయినాథుడి రూపంలో జన్మ లేకుండా, తల్లితండ్రులు లేకుండా 16 సంవత్సరాల వయసు గల వ్యక్తిగా షిరిడిలో ప్రత్యక్షమయ్యాడు. ఇది యథార్థమైన సత్యం. షిరిడి సాయినాథుడికి తల్లితండ్రులను ఆపాదించకండి. తల్లి లేదు, తండ్రి లేదు, పేరు లేదు, కులం లేదు, మతం లేదు అటువంటి వ్యక్తి ఎవరయ్యా అంటే భగవంతుడు ఒక్కడే. ఆ భగవంతుడే షిరిడి సాయినాథుడు అని ముమ్మాటికి సత్యమని చెప్తాను.

మతము లన్ని చేరి మతిచెడి కలహింప
బ్రతుకలేక ప్రేమ పరుగుదీయు
ప్రేమ లేని మతము పిచ్చిగా మారురా!
శాంతిప్రేమదాయి! సత్యసాయి!

మనిషిని బాగుచేయడానికే మతం. ఒక మహాత్ముడు పుట్టి తన మనసులో వచ్చే ఆలోచనలతోటి, హృదయంలో కలిగే స్పందనతో వచ్చిన అనుభూతితో, దైవానుగ్రహం పొంది తను ఆచరిస్తూ, ప్రబోధిస్తే ఆ పేరుతో మతాలు వచ్చాయి. క్రీస్తుని అనుసరించుకుంటూ వచ్చే మతం క్రైస్తవ మతం, బుద్ధుడిని అనుసరించే మతం బౌద్ధమతం, మహమ్మదుని అనుసరించుకుంటూ వచ్చేది మహమ్మదీయ మతం. అలా మతాలన్ని వచ్చాయి. ఈ మతాలన్ని మనిషిని బాగుచేయడానికి వచ్చాయి. కాని మనిషిని పశువుగా, రాక్షసునిగా మార్చి, ఈర్ష్య, అసూయ, ద్వేషాలను పెంచి, మనిషి మనిషిని చంపుకునే స్థితికి తీసుకువెళ్ళేందుకు అయితే అటువంటి మతం మనకు అక్కరలేదు అని ప్రజలే చెప్తారు, జాగ్రత్త. మతం పేరుతో మంచిని చేయండి. ప్రేమను పెంచండి, ప్రేమను పంచండి. క్రీస్తు చెప్పాడు నీ పొరుగువారిని నీవలె ప్రేమించు అని. ఎంత మంచి మాట అది. నిన్ను నువ్వు ఎట్లా ప్రేమించుకుంటున్నావో అలాగ

నీ పొరుగువారిని కూడా ప్రేమించు. అంటే అర్థం ఏమిటి నేను నీ హృదయంలో ఉన్నాను నీ పొరుగువారి హృదయంలో కూడా ఉన్నాను కాబట్టి భేదం చూపించవద్దు. అదే శంకరాచార్య కూడా చెప్పారు 'ఈశ్వరస్సర్వభూతానాం' అని. భగవంతుడు సమస్త భూతములలోను ఉన్నాడు, చీమ, దోమ, పిల్లి, పంది అన్నిటిలోను ఉన్నాడు ప్రేమించండి ద్వేషించకండి అని. మహమ్మదు కారుణ్యంతో చెప్పాడు. చక్కగా కారుణ్యం పంచండి. హృదయంలో ప్రేమను నింపుకోండి, మనసులో శాంతిని నింపుకోండి. ప్రేమపూరితమైన హృదయాన్ని, శాంతియుతమైన మనసుని షిరిడి సాయినాథుని యొక్క దివ్యపాదాల వద్ద పెట్టండి. అదే సాయినాథుడు ఈనాడు కోరు కుంటున్నది. రెండు పుష్పాలు ఇవ్వండి. మనో పుష్పం, హృదయ పుష్పం. మనసు అనే పుష్పాన్ని, హృదయమనే పుష్పాన్ని నా పాదాల వద్ద పెట్టండి అని కోరుతున్నాడు. అవి సువాసన కలిగి లేవు కాబట్టి సువాసనభరితంగా చేసి ఉంచండి అని అంటున్నాడు. హృదయాన్ని ప్రేమతోను, మనసుని శాంతితోను నింపి సమర్పించాలి. అలాగ మన హృదయాన్ని ప్రేమతో, మనసుని శాంతితో నింపుకోవాలి అప్పుడు వాటిని షిరిడి సాయినాథుడు యొక్క పాదాల వద్ద ఉంచాలి. అది ఈనాడు కావలసినది.

శ్రీలంకలో 88 బాంబులను నిర్వీర్యం చేసారు. ప్రతి రోజు బాంబులు ఎక్కడో అక్కడ పేలుతూనే వున్నాయి. ఇదేనా మానవత్వం? భగవంతుడు మనలను అడుగుతున్నాడు ఓ మనిషి! నిన్ను సృష్టించాను, విశ్వాన్ని సృష్టించాను, ప్రపంచాన్ని సృష్టించాను, దేహాన్ని ఇచ్చాను, మనసుని ఇచ్చాను, ప్రాణాన్ని ఇచ్చాను, పంచభూతాలను ఇచ్చాను, కాని నువ్వు ఏంచేస్తున్నావు? వాటిని ఉపయోగించుకుని మిమ్ము మీరు బాగుచేసుకుని ప్రపంచాన్ని స్వర్గధామంగా, శాంతి నిలయంగా చేసుకోకుండా ఒకళ్ళనొకళ్లు నరుక్కుంటున్నారు మతం పేరుతో, కులం పేరుతో లేక ఇంకేదో పేరుతో, డబ్బు కోసం లేక ఇంకోదాని కోసం. శరీరంలో ప్రాణశక్తి ఉన్నంతవరకే, అది వెళ్ళిపోయిన తరవాత నీ భార్య కూడా ముట్టుకోదు. అలాంటి ఈ శరీరం కోసం, శరీర సుఖం కోసం ఎందుకు తప్పుడు పనులు చేస్తున్నావు. భగవంతుడు ఉన్నాడు. తప్పక ఉన్నాడు.

భగవంతుని యొక్క దివ్యమైన శక్తి అంతటా వ్యాపించి ఉంది. అది మూడవ కన్ను (third eye), (The univsrsal eye is always looking at us) విశ్వనేత్రం మనలను గమనిస్తూనే వుంటుంది. మనం అన్నిటిని, సుప్రీంకోర్టుని తప్పించుకోవచ్చు, కాని విశ్వ న్యాయస్థానము నుండి తప్పించుకోలేము. ఏమి చేసినా అది అన్నిటిని రికార్డు చేస్తుంది, భవిష్యత్తులో అనుభవించడానికి మీరు సిద్ధంగా ఉండాలి జాగ్రత్త. బాగుపడడానికి రెండు పద్ధతులు ఉన్నాయి. ఒకటి మనలని మనం సవరించుకోవడం, రెండు సవరించబడటం. మనలని మనం సవరించుకోవడం శ్రేయస్కరం, ప్రశాంతంగా ఉంటుంది. రెండవది ప్రకృతిచేత గాని, భగవంతుని చేత గాని సవరించబడటం. అది చాలా కఠినంగా ఉంటుంది. ఆ స్థితి రాకూడదు. భగవంతుడుకి మనమే చెప్పాలి 'ఓ భగవంతుడా! నువ్వు మానవరూపంలో రానక్కరలేదు, మేమే సమైక్యమై మా గృహాన్ని మేము బాగుచేసుకుంటాం, మా మనసుని ప్రశాంతి నిలయంగా చేసుకుంటాం, మా ఇంటిని, దేశాన్ని, ప్రపంచాన్ని ప్రశాంతి నిలయంగా మార్చుకుంటాం, నీవు మానవరూపంలో వచ్చి చేయవలసిన అవసరం లేదు' అని చెప్పవలసిన సమయం ఆసన్నమయ్యింది. మన రాష్ట్రం అత్యంత శక్తివంతమైన, ప్రశాంతమైన రాష్ట్రంగా మార్చుకోవలసిన భాధ్యత ఒక్క రాజకీయ నాయకులదే కాదు ప్రతి ఒక్క వ్యక్తి మీద ఉంది. భారతదేశం ప్రపంచంలో గురుస్థానానికి వస్తుందని ఎప్పుడో చెప్పాను, ఈనాడు అది నిజమయింది. అగ్రదేశాలయిన అమెరికా, రష్యా, చైనా, భారతదేశం చెప్పినట్లు నడచుకునే రోజు వస్తుందని సగర్వంగా చెప్తున్నాను.

రాజకీయాలు మంచిది కాదు అనుకుంటారు. కాదు రాజకీయాల వలన అధికారం పొందవచ్చు, సమాజానికి ఎంతో సేవ చేయవచ్చు. రాజకీయాలు అంటే నాకు ఎంతో ఇష్టం. రాజకీయం అంటే ఏమిటో అంతకు ముందు చెప్పాను మళ్ళీ చెప్తాను వినండి. ఎంతో రక్తపాతం జరగవలసిన చోట, రక్తం ఏరులై ప్రవహించవలసిన చోట, ఎంతమందో చనిపోవలసినచోట, ఒక్క రక్తపు బొట్టు కారకుండా, ఒక్క వ్యక్తి మరణించకుండా సమస్యని

శాంతియుతంగా, ప్రశాంతంగా పరిష్కరించడం రాజకీయం. అలాంటి రాజకీయం చేసే వ్యక్తులంటే విశ్వయోగి విశ్వంజీకి ఇష్టం. అలా కాకపోతే అది అరాజకీయం గాని రాజకీయం కాదు. రాజకీయం ఉండితీరాలి. ఆధ్యాత్మికత ద్వారా సమాజానికి ఎలా మేలు జరుగుతుందో అలాగే రాజకీయం ద్వారా కూడా సమాజానికి మేలు జరుగుతుంది. రాజకీయ నాయకులుగా ఎదిగేవాళ్ళు భవిష్యత్తులో మన దేశ కీర్తిని, ప్రగతిని చాటి చెప్పే వ్యక్తులుగా తయారవుతారని విశ్వసిస్తున్నాను. ఈ నగరానికి, ఈ రాష్ట్రానికి, దేశానికి పేరు వచ్చి వెలుగొందాలని, శారీరక, మానసిక, ఆర్థిక, సాంఘిక, ఆధ్యాత్మిక బలములను పొంది సమాజానికి మేలు చేయాలి. తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు, విద్య, వైద్యం ఈ ఐదు ముఖ్యమైన వాటిని చక్కగా అమర్చగలిగే రాజకీయ సంస్థ అభివృద్ధిలోకి వస్తుంది. ఆ విధంగా ఆ మార్గంలో సాగితే విజయాలను సాధిస్తారు. అందరికి దివ్యమైన ఆశీస్సులు.

## గురూపదేశములు

పెద్ద మాను ఒకటి ప్రవాహమున కొట్టుకుని పోవునప్పుడు అది యెన్ని వందల పక్షులనో తనపై మోసికొని పోగల్గును; అది మునగదు. రెల్లు పుల్ల అయినచో ఒక్క కాకి వ్రాలిన చాలును, మునిగిపోవును. అటులనే అవతార పురుషులు వచ్చినప్పుడు వారి నాశ్రయించి అనేకులు ముక్తి నొందగలరు. ఇక సిద్ధపురుషుడో, ఎన్నియో పాట్లుపడి తనను మాత్రమే రక్షించుకొనును. పొగబండిని లాగుచున్న యంత్రము (రైలు ఇంజను) తాను గమ్యస్థానము చేరుటయేగాక తనతో బాటుగా సామానులతో నిండిన అనేకమైన బండ్లను లాగుకొని పోవుచున్నది. ఇట్లే అవతారపురుషులు జనులను (సంసార భారముచే కృంగిన వారు) ఎందరనో కొనిపోయి భగవత్సాన్నిధ్యమున జేర్చుచున్నారు.

**- శ్రీ రామకృష్ణ పరమహంస**

## వేదాంత కథాస్రవంతి

# పరమాద్భుతము

పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో వారికి దాహం కలిగి సమీప ప్రాంతంలో ఏదైనా సరోవరం ఉన్నదేమోనని వెతకగా కనిపించింది. పాండవులలో ఆఖరువాడు సహదేవుడు నీరు తేవడానికి ఆ కొలను దగ్గరకు వెళ్ళాడు. అక్కడ ఒక కొంగ కూర్చుని ఉంది. నీరు తీసుకోబోతున్న సహదేవుడిని 'నేను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగితే నీవు నీరు తీసుకుని వెళ్ళవచ్చు, నాకు సమాధానం ఇవ్వకుండా నీవు కొలనులోని నీరు ముట్టుకుంటే ప్రాణాలు కోల్పోతావు' అని అంది. దాని మాటలు లెక్క చేయకుండా సహదేవుడు నీళ్లు ముట్టుకున్నాడు వెంటనే మరణించాడు. ఇతడు ఇంతవరకు రాలేదేమిటి అని నకులుడు వెళ్ళాడు. అతడు కూడా కొంగ మాటలు లెక్క చేయక నీరు తెచ్చే ప్రయత్నం చేసి ప్రాణాలు కోల్పోయాడు. తరవాత అర్జునుడు, భీముడు కూడా వెళ్లి అదే పరిస్థితికి లోనయి విగతజీవులయ్యారు.

సోదరులు వెళ్ళినవారు ఎవరూ తిరిగి రాలేదు ఎందుకని అని ఆలోచిస్తూ ధర్మరాజు కొలను దగ్గరకు వచ్చాడు, ప్రాణాలు కోల్పోయి పడివున్న సోదరులను చూసాడు. అక్కడే వున్న కొంగను కూడా చూసి వెంటనే ఆ కొంగ సాధారణ మైనది కాదని సాక్షాత్తు ధర్మదేవత ఆరూపంలో ఉందని గ్రహించాడు. ఆ కొంగ జరిగినదంతా చెప్పి తన ప్రశ్నలకు సమాధానం చెపితే సోదరులు నలుగురు తిరిగి జీవిస్తారు అని అంది. సరేనని ధర్మరాజు అంగీకరించాడు. ఈ ప్రపంచంలో అద్భుతములలో కెల్లా అద్భుతము, పరమాద్భుతము ఏమిటి అని అడిగింది. ప్రతి రోజు వేలాది జీవులు మరణిస్తున్నారు అయినా జీవిస్తున్నవారు తాము కూడా ఒక రోజు మరణిస్తాము అని ఆలోచించరు. అదే అద్భుతములలో అద్భుతము, పరమాద్భుతము అని సమాధానం ఇచ్చాడు. దానికి సంతృప్తి చెంది ఇంక కొన్ని ప్రశ్నలు అడిగింది ఆ కొంగ. అన్ని ప్రశ్నలకు సరియైన సమాధానం చెప్పడంచేత నలుగురు సోదరులు ప్రాణాలు పొందారు. తమ దాహం తీర్చుకుని పయనమయ్యారు.

***(స్వామి సంబుద్ధానంద యొక్క వేదాంత ట్రూ స్టోరీస్ నుండి సేకరణ)***

# శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి

## (టెంబే స్వామి)

## సద్గురు చరిత్ర

## ఇరువదవ అధ్యాయము

- శ్రీ జి.వి.ఎల్.ఎన్. విద్యాసాగర శర్మ

(గత సంచిక తరువాయి)

### ఆచార పాలనము

గత అధ్యాయములో మహారాజ్ శినూర్‌లో నివసించుచున్నప్పుడు జరిగిన విశేషములు కొన్ని వర్ణించబడినవి. ఈ అధ్యాయమునందు మిగిలిన విశేషములు చెప్పబడినవి. ప్రతిదినము సాయంకాలములందు దక్షిణాది బ్రాహ్మణులు సంధ్యా వందనమునకై నర్మదా ఘట్టమునకు వచ్చెడివారు. ఆ సమయమునందే మహారాజ్ కూడ అచ్చటకు పోయెడివారు. ఆ బ్రాహ్మణులు పైబట్టతీసి గట్టున బెట్టి, నీరు వెంబడి తీసుకొనిపోకుండా లఘుశంకకు పోయెడివారు. అదిచూచి మహారాజ్ ఒక సమయమున పురాణము చెప్పుచున్నడు ప్రసంగవశమున 'ఆచారః ప్రథమో ధర్మః' అను విషయమును సాంగోపాంగముగా విశదీకరించిరి. ఆనాటి నుండి బ్రాహ్మణులు నీరు తీసుకొని లఘుశంకకు పోవుట, యిండ్లలో నైవేద్యవైశ్వదేవములు చేయుట మొదలుపెట్టిరి.

ఈ ప్రకారముగనే ఒకనాటి సాయంకాలము లీలానందస్వామియు మహారాజ్ ఇరువురు కలిసి ఘట్టము దగ్గరకు పోవుచుండిరి. దారిలో కొంతమంది పిల్లలు గాలిపటముల నెగురవేయుచుండిరి. గాలిపటముల దారము గాలివిసరునకు వచ్చి, ఆ యిద్దరికి తగిలెను. అది సాయంకాలమైనందున, అంత చలిలో మరల స్నానము చేయవలసివచ్చినదన్న విసుగుతో లీలానందస్వామి "ఈ పిల్లలు సన్యాసులను నెంతగా బాధించుచున్నా"రని మహారాజ్‌తో ననెను. మహారాజ్ నవ్వుచు "బాధయని ఎందుకనుకొనవలెను? ఈ పిల్లలు మనవారే. మన పిల్లలు చేసిన పనికి మనము బాధపడరాదు" అని శాంతముగా పలికిరి. లీలానందస్వామి ఆయన మాటలు విని మిన్నకుండెను.

## అతిసార వ్యాధి

మహారాజ్‌ను చాలా సంవత్సరముల నుండి అతిసార వ్యాధి పట్టుకొని పీడించుచుండెడిది. ఆ విషయము మనకు తెలియును. ఒకసారి ఒక సంగ్రహణ రోగి మహారాజ్ దగ్గరకు వచ్చెను. అతడు తన వ్యాధి తగ్గుటకేమైనను ఉపాయము చెప్పుడని మహారాజ్‌ను అడిగెను. అప్పుడు మహారాజ్ “నాకు కూడా ఈ వ్యాధి చాలాకాలము నుండి యున్నది. నా పూర్వాశ్రమములో ఒకడు నాపై అభిచార తంత్ర ప్రయోగము చేయుటచే అది నన్ను పట్టుకొన్నది. దానికి చల్ల, పుల్లగంద, జాజికాయ అప్పుడప్పుడు కొంచెము నల్లమందు ఉపయోగించుచున్న తక్కువ కాగలదు” అని చెప్పిరి.

## దత్తమంత్రోపదేశము

రామశాస్త్రి మేనమామ గారింటిలో మొదటినుండియు దత్తోపాసనలేదు. రామశాస్త్రి జన్మించిన తరువాత, ఒక బ్రాహ్మణుడు రామశాస్త్రి మేనమామకు గురుచరిత్ర గ్రంథమొకటి యిచ్చి, నిత్యము పారాయణ చేయుమని చెప్పెను. ఆ విధముగా ఆయన నియమనిష్ఠలతో గురుచరిత్ర పారాయణ చేయుచుండెను. దత్తజయంతి ఉత్సవములు వచ్చినంతనే గురుచరిత్ర సప్తాహము చేయుటకు గాను, ఆ పుస్తము తీసికొని రమ్మని మహారాజ్ రామశాస్త్రి మేనమామకు చెప్పిరి. ఆయన ఆ గ్రంథము తీసుకొనిరాగా, మహారాజ్ ఆయనను చూచి “మీవంటి వైదికులు ప్రాకృత గ్రంథములను కన్నెత్తి చూచుటకైనను ఇష్టపడరే! మరి మీరు దీనిని నిజముగా చదువుచున్నారా?” అని చమత్కారముగా ప్రశ్నించిరి. “వట్టిగా చదువుట కాదు మహారాజ్! ఆ పవిత్ర గ్రంథమును నిత్యము పారాయణ చేయుచున్నా”నని రామశాస్త్రి మేనమామ సగర్వముగా ప్రత్యుత్తరమిచ్చెను. ఆ తర్వాత రెండు మూడు దినములకు మహారాజ్ తమ పరిపూర్ణ కటాక్షము వర్షించి, రామశాస్త్రి మేనమామకు దత్తమంత్రము నుపదేశించిరి.

### గాండాబువా

గురుచరిత్ర పారాయణ సప్తాహము జరుగుచున్న సమయమున ఒకరోజు రామశాస్త్రిని జూచి మహారాజ్ “ఇక్కడకు కొలది రోజులలో ఒక దేశ ద్రిమ్మరి

రాగల"దని పలికిరి. ఆ మాటవిని రామశాస్త్రి "ఇది సప్తాహ మహోత్సవము గదా! ఒక దేశ ద్రిమ్మరి ఏమిటి? ఎంత మందైనను రావచ్చు"ననిరి. రెండు మూడు రోజులు గడచెను. ఒకనాడు మధ్యవస్కుడైన ఒక గుజరాతి బ్రాహ్మణుడు కఱ్ఱ చేతితో పట్టుకొని మహారాజ్ దగ్గరకు వచ్చెను. అతడు శినూర్‌లో అందరికీ తెలిసిన వాడే! పూర్వమతడు ఆ ప్రాంతములో ఎక్కువగా బెల్లము వ్యాపారము చేసి యుండెను. అతడు సంసారముపై విరక్తి చెంది మహారాజ్ దర్శనార్థము వచ్చెను. మహారాజ్ ఎనిమిది రోజుల వరకు అతనితో మాట్లాడలేదు.

అతడు ప్రొద్దుననే నిద్రలేచి, స్నానము చేసివచ్చి మహారాజ్ కూర్చుండెడి మిద్దెపై ఒక మూల కూర్చుండుట, మహారాజ్ భిక్షకై వెడలినంతనే తాను గూడ నెచ్చటికో పోయి తిండితిని వచ్చి, మహారాజ్ తిరిగి వచ్చులోపలనే తన స్థానములో తాను కూర్చుండుట, చేయుచుండెడివాడు. ఒకరోజు అతనిని జూచి "నీవిచ్చట కెందుకు వచ్చితి?"వని ప్రశ్నించిరి. "నన్నుద్ధరించునన్న విశ్వాసముతో మీ చరణములను శరణు జొచ్చితి"నని అతడు బదులు చెప్పెను. అతడు తన వృత్తాంతమంతయు మహారాజ్‌తో నిట్లు చెప్పసాగెను. "మా యూరు తెలంగపురము. చిన్నప్పుడు నేను కొంటెపనులు చేయుటవలన లోకులు నన్ను "గాండ" (పిచ్చివాడు) అనెడివారు. క్రమముగా ఆ పేరే నాకు స్థిరపడినది. నా అసలు పేరు కళ్యాణ్. ఎనిమిదవ యేటనె నాకు పెండ్లి అయినది. చదువు పూర్తియైన తరువాత కొన్ని రోజులు బడిలో ఉపాధ్యాయునిగా పనిచేయుచు, మరొక ప్రక్క స్వంత వ్యాపారము గూడ చేయుచుంటిని. నాకు మనశ్శాంతి లేనందున, సాధుపుంగవుల నన్వేషించుచు మదరాసు పర్యంతము తిరిగితిని. కాని వృథాప్రయాసయైనది. ఒక్క మహాత్ముడైనను నాకు కనిపించలేదు. నా ఉపాసనా దైవము శంకరుడు. జన్మతః నేను బ్రాహ్మణుడను. బ్రాహ్మణ వంశములోని వారే నాకు సద్గురువుగా లభించవలెనని నా కోరిక. కొన్ని దినములు నేను పాండిచేరిలో నౌకరి చేసితిని. స్వల్పకాలములోనే ఆ ఉద్యోగము నుండి నన్ను తొలగించిరి. నేను ఇంటికి తిరిగి వచ్చితిని. నా చిత్తము నా స్వాధీనములో నుండనందున అన్నము నీళ్ళు సహించెడివి కావు. తల్లిదండ్రులు జీవించియుండుటచేత తపశ్చర్యకు పోవుటకు వీలు లేకుండెను. ఇంటిలో సిరిసంపదలకు లోటు లేకున్నను ఏదో తీవ్ర అసంతృప్తి నా మనస్సును పట్టి

వేధించుచున్నది. లౌకిక విషయములు నాకు సుఖములుగా తోచుట లేదు. అందుచేత నర్మదా తీరమున నివసించుచు బ్రాహ్మణ సేవలో కాలము గడుపుచుంటిని. నేనట్లు చేయుచుండట మా తండ్రికి ఇష్టము కాలేదు. వ్యాపారము మానినందుకు నన్ను తీవ్రముగా నిందించిరి. ఇంటికి బలవంతముగా తీసుకొని పోయి బయటకు నేనెక్కడకు పోకుండా కట్టుదిట్టములు చేసెను. ఒకరోజు బాకీ వసూలు చేసుకొని వచ్చెదనని నమ్మకముగా చెప్పి, ఇంటినుండి బయటపడితిని. ఎవరు నన్ను గుర్తుపట్టకుండుటకై బైరాగి వేషము వేసుకొని ఓంకారేశ్వరము అడవులలో ఒక మర్రిచెట్టు క్రింద కూర్చుండి, "ఎవరైనను సద్గురువులు కనిపించక పోదురా" యని నిరీక్షించుచుంటిని.

కొంతకాల మట్లు గడచెను. లోకులు నన్ను 'బ్రహ్మచారి'యని పిలుచుట మొదలుపెట్టిరి. పాండురంగ మహారాజ్ అను మహాత్ముడు నర్మదాతీరమున ఉండెడివారు. వారి దగ్గరకు పోయి నా కథ చెప్పితిని. ఆయన ప్రతిరోజు నియమముగా భిక్షచేసి ధాన్యము తెచ్చి, స్వయముగా విసరి, పిండిచేసి, నర్మదా ప్రదక్షిణవాసులకు భోజనము పెట్టెడివారు. ఒకరోజు వారు వండిన అన్నమును దొంగలు వచ్చి తినివేసిరి. తక్షణమే ఆ దొంగలకు కడుపుబ్బి ప్రాణాంతక మయ్యెను. ఆ దొంగలు పాండురంగ మహారాజ్ శక్తిని తెలుసుకొని వారిని శరణుజొచ్చిరి. అప్పుడాయన వారిపై దయజూపి, వారి బాధ తొలగించి, మరల కడుపునిండ అన్నము పెట్టి, ఉపదేశముచేసి పంపివేసిరి. ఆ మహారాజ్ నా కథ విన్నారేకాని ఏమియు మాటాడలేదు. నేను తిరిగి వచ్చితిని. నర్మదామాతకు నామీద జాలి కలిగి, నా దగ్గరకు వచ్చి, "ఈ భయంకరారణ్యములో సిద్ధపురుషుడు నీకెక్కడ దొరకగలడు? నీవు నియమావర్ పోయి, అచ్చటగల సిద్ధేశ్వరాలయములో జపానుష్ఠానము చేసినచో అచ్చటనే నీకు సద్గురువు లభించగల"దని ఆజ్ఞాపించెను. ఆమె ఆజ్ఞానుసారము నియమావర్ వచ్చి, అనుష్ఠానము చేసికొనుచుంటిని. అచ్చట మీ గురించి వార్త కొంతమంది చెప్పగా విని మీ శరణుజొచ్చితిని. నన్ను పాలముంచినను, నీట ముంచినను మీదే భారము." ఆ బ్రాహ్మణుని అక్కడి లోకులు గాండాబువా అని పిలిచెడివారు. గాండాబువా చెప్పిన వృత్తాంతమంతయు శ్రద్ధగా నాలకించి మహారాజ్ పకపక నవ్విరి.

కొన్నిదినముల తరువాత మహారాజ్ అతిని వెంటబెట్టుకొని 'కోదా' యను గ్రామముపోయి, అచ్చట ఉన్న శివాలయము జూపి "ఇచ్చట యోగాభ్యాసము చేయుచుండుము. నీ శ్రద్ధానుసారము శంకరుడు నీ అభీష్టము తీర్చగల"దని చెప్పి, యోగాభ్యాసవిధి నెరుక పరచి ముందుకు సాగిరి.

తర్వాత కొన్నాళ్ళకు గాండాబువా మహారాజ్‌ను దర్శించుటకు రాగా "నీవు నీ తల్లిదండ్రుల దగ్గరికిపోయి క్షమాపణ వేడుకొనుము. సంతోషపూర్వకముగా వారిచ్చు అనుజ్ఞ గ్రహించి, నా చాతుర్మాస సమయమునకు ద్వారకకు రమ్ము" అని ఆజ్ఞాపించిరి. మహారాజ్ ఆజ్ఞానుసారము గాండాబువా తన యింటికి పోయెను.

## ఫెండార్కర్

శినూర్‌లో కృష్ణారావు ఫెండార్కరను కచేరి ఉద్యోగి ఒకడుండెను. అతడు ప్రతిదినము నియమముగా మహారాజ్ దర్శనార్థము వచ్చెడివాడు. భిక్షా సమయమునకు మహారాజ్ వెంబడిపోయి, దక్షిణాది బ్రాహ్మణ గృహములు చూపించెడివాడు. ఒక బిందెలో నీళ్ళు నింపుకొని, మహారాజ్ నడుచు దారిలో ముందు నడచుచు నీళ్ళు చల్లెడివాడు. ఆయన వెనుక, నీళ్ళు చల్లిన బాటమీదుగా మహారాజ్ నడిచిపోయెడి వారు. మూడు గృహముల నుండి భిక్ష గ్రహించినంతనే నర్మదా నదీజలములలో ఆ మాధుకరము జోలెను ముంచి, శుద్ధిచేసి మందిరమునకు తిరిగి వచ్చెడివారు. అచ్చట మందిరములో ఫెండార్కర్ ఆవు పేడతో నలికి శుద్ధిచేసి మహారాజ్ ఆగమనమునకై నిరీక్షించు చుండెడివాడు. ఆ శుద్ధిచేసిన స్థలములో మహారాజ్ మాధుకరము జోలెనుంచి, ఆ అన్నమును మూడు భాగములగా చేసి, ఒక భాగము నర్మదకు, రెండవది గోవులకు నొసగి, మూడవ భాగమును తాము గ్రహించెడివారు. ఎప్పుడైనను దారిలో స్పర్శదోషము కలిగిన, ఆ భిక్షాన్న మంతయు నర్మదా నదిలో పడవైచి, యుపసించెడివారు. పాఠము, ప్రవచనము, పురాణము నిత్యక్రమము తప్పక వారు చెప్పుచుండిరి. ఫెండార్కర్ యొక్క సత్త్వలక్షణమును జూచి, అతనికి మహారాజ్ ఒక మంత్రము నుపదేశించి, అనుష్ఠానము చేయుమని చెప్పిరి. అతడు శ్రద్ధగా ఆ మంత్ర జపము చేసిన కారణమున పెద్ద యుద్యోగము దొరికెను. మామ్లేదార్ పదవిని

గూడ పొంది, తదుపరి ఫించను తీసికొనెను. ఉద్యోగము చేయుచున్నప్పుడు అతనిపై నెన్ని అభియోగములు వచ్చినను, మహారాజ్ కృపచే అవి యన్నియు తొలగి పోవుచుండెడివి.

## గురుచరిత్ర టీకా రచన

గాండాబువాను ఆయన తల్లిదండ్రుల దగ్గరకు పంపించిన తరువాత, మహారాజ్ జునాఘడ్ వెళ్ళి గిరినార్ పర్వతము నధిరోహించిరి. అచ్చటి దత్త పాదుకలను దర్శించి, వందన మాచరించి తిరిగి వచ్చిరి. సురటీ సోమనాథుని దర్శనము చేసుకొనవలయును తలంపుతో మాఘమందు వారు ప్రభాస తీర్థమును జేరుకొనిరి.

సురుటీ సోమనాథములోని అర్చకుడు బాలంభట్ మోడే బలవంతము చేయుటచే కొన్నిదినములు వారచ్చట యుండిరి. అక్కడ బోదా యొక్క మంత్రులు కొందరు మహారాజ్ దర్శనార్థము వచ్చిరి. మహారాజ్ సాంగత్యము కలుగగనే వారికి ఆచార విచారములయందు పూర్తిగ పరివర్తన మయ్యెను. అందరును నాస్తికత్వము విడిచి స్వీయాచార ధర్మ ప్రవర్తకులైరి. ప్రభాస పట్టణములో మహారాజ్‌కు "ద్విసాహస్రి గురుచరిత్ర మీద టీకా వ్రాయు"మని దత్తప్రభువు ఆజ్ఞయయ్యెను. ఆ సమయమున మూలగ్రంథ మాయాన దగ్గర లేకుండెను. అయినను భగవదాజ్ఞకు కట్టుబడి ఒక శుభ ముహూర్తమున టీకా వ్రాయుటకు పూనుకొనిరి. తొమ్మిది అధ్యాయముల పర్యంతము వ్రాసిరి. ఆ విషయమును మహారాజ్ స్వయముగా నిట్లు వ్రాసిరి. "ఈ సమయమున పారాయణము చేసెడి మూల గ్రంథము దగ్గర లేనందున దినమునకు రెండు గడియలు మాత్రమే గురుచరిత్రపై పూర్తియైనవి. సంస్కృత టీకా చేయుట కిచ్చగించితిని. పన్నెండు వందలు పూర్తియయ్యెను. ముందే రీతిగా జరుగునో? దైవేచ్ఛ. గురుదేవ దత్త".

## గజానన బాపు సబ్నీస్

సావంతవాడిలోని రాంభావ్ సబ్నీస్ కుమారుడైన గజానన బాపు సబ్నీస్ ఆ సమయములో ద్వారకలో మామ్లేదారుగా నుండెను. ఆయన మహారాజ్ దగ్గరకు వచ్చెను. పూర్వాశ్రమములో ఆయన ఉపనయనమును మహారాజ్

స్వయముగా జరిపించిరి. పూర్వపు వృత్తాంతములను వారిరువురు పరస్పరము కొంతసేపు ముచ్చటించుకొనిరి. గజాననబాపు సబ్నీస్‌కు మహారాజ్‌పై అత్యంత ఆదరాభిమానములు కలిగెను. అతని ప్రవృత్తిలో పూర్తిగా మార్పు వచ్చెను. ఆ తర్వాత గూడ గరుడేశ్వరుమలో మహారాజ్ నివసించుచున్నపుడు వారి దర్శనార్థము వచ్చుచుండెడివాడు.

## ద్వారకకు చేరుట

ప్రభాస క్షేత్రము నుండి వెడలి మహారాజ్ ప్రాచీన సరస్వతి చేరుకొనిరి, ఆ స్థలములోని శ్రీకృష్ణపరమాత్మ నిజధామమునకు పోయిరి. ఆ స్వామికి నమస్కరించి పోర్‌బందర్ (సుధామపురి) వెళ్ళిరి. అచ్చట కొన్ని రోజులుండి, జ్యేష్ఠమాసమందు ముక్తి క్షేత్రములో నేడవదిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ క్షేత్రద్వారకకు మహారాజ్ చేరుకొనిరి.

ఓం శ్రీ గురుదేవ దత్త

ఓం శాంతిః శాంతిః శాంతిః.

ఇరువదవ అధ్యాయము సంపూర్ణము.

# ఇరువదియొకటవ అధ్యాయము

## తొమ్మిదవ చాతుర్మాస దీక్ష – ద్వారక (శక సం॥ 1821)

## ప్రస్తావన

**దిగంబరం భస్మవిలేపితాంగం బోధాత్మకం ముక్తికరం ప్రసన్నం**
**నిర్మానసం శ్యామతనుం భజేహం దత్తాత్రేయం బ్రహ్మసమాధియుక్తం**

**దేహధారీ భువిప్రాప్తో యతిరూపేణ చాత్రిజః**
**కలౌ భక్తాన్ సముద్ధర్తుం వాసుదేవ నమోస్తు తే ॥**

శ్రీ దత్తాత్రేయ గురుభ్యోనమః, శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామివారు తమ తొమ్మిదవ చాతుర్మాస దీక్ష జరుపుటకై ద్వారకకు చేరిరని లోగడ అధ్యాయములో చెప్పబడినది. మహారాజ్ తమ సన్న్యాస దీక్షానంతరము ఎనిమిది

సంవత్సరముల కాలము వివిధ ప్రదేశములలో పర్యటించి, దత్తప్రభువు ఆజ్ఞానుసారము తమ జీవితము నెట్లు వర్ణాశ్రమాచార ధర్మరక్షణమున కంకితము చేసిరో ఈ చరిత్ర ఉత్తరార్థమున కొంతవరకు మనము తెలిసికొనుట జరిగినది. ఈ అధ్యాయములో వారు ద్వారకలో ద్విసాహస్రి టీకా పూర్తిచేసిన విధము, గాండాబువాను పరీక్షించిన వైనము మొదలైన వివిధాంశములు వర్ణించబడినవి. వానిని చదువుదము.

## ద్వారకా నివాసము

మహారాజ్ ద్వారకకు చేరుకొన్న పిదప అచ్చటగల శ్రీ శంకరాచార్య శారదా పీఠములో నివసించిరి. ఆ సంవత్సరము వర్షములు పడనందున ఆ ప్రాంతములో కఱువు కాటకములు తాండవించుచుండెను. జనులకది దుష్కాలముగా నుండెను. మేత దొరకకపోవుటచే ఐదురూపాయల కొక బఱ్ఱెను అమ్ముదమన్నను కొనెడి నాథుడు లేకుండెను. తిండి పెట్టలేక ప్రజలు భార్యా బిడ్డలను సైతము విడిచి పెట్టుటకు సిద్ధపడుచుండిరి. గాయక్వాడ ప్రభువులు ఆ సంవత్సరము రెండున్నర లక్షల రూపాయలు ప్రజల కన్నదానము నిమిత్త మొసగిరి. మహారాజ్ ఆగమనము తెలిసి జనులందరు ఆనందోత్సాహములతో వారి దగ్గరకు పోయి "ఇచ్చట చాతుర్మాసములు చేయు"దని మహారాజ్‌ను వేడుకొనిరి. ఆ ప్రకారము శక సంవత్సరము 1821లో మహారాజ్ చాతుర్మాస దీక్ష అచ్చట జరిగెను. అచ్చట దక్షిణాది బ్రాహ్మణ కుటంబము లెక్కువగా నుండుటచే మహారాజ్ భిక్షకు ఆటంకమేమియు లేకుండెను.

## సంగ్రహణి వ్యాధి

గుజరాత్‌లో దక్షిణాది బ్రాహ్మణ గృహములు చాల తక్కువగా నుండుటచే మహారాజ్ ద్వారకకు వచ్చునప్పుడు, దారిలో ముప్పది మూడు దినములు భిక్ష దొరకక ఉపవాస ముండవలసి వచ్చెను. గుజరాతి బ్రాహ్మణు లొసగిన ఖర్జూర ఫలములు, ఎండుకొబ్బరి, పచ్చికొబ్బరి తిని యుండవలసి వచ్చెను. ధర్మ సంరక్షణమును ధ్యేయముగా పెట్టుకొని, అతి భయంకరమైన శరీరబాధ ననుభవించి మహారాజ్ ద్వారకా యాత్ర పూర్తిచేసికొనిరి. ఆ బాధచేత వారికి రక్తము పడుచుండెను. సంగ్రహణి వ్యాధి వికారమెక్కువయ్యెను. మధ్యమధ్య

నీళ్ళు త్రాగి నపుడెల్లను విరేచనములగుచుండెను. ప్రారబ్ధమును భోగించియే తొలగించుకొనవలెనని నిర్ధారణ చేసుకొని తమ బాధ నివారించుకొనుటకై ఎట్టి ఉపచారము చేసికొనుటకు వారు సమ్మతించలేదు. బాధల నావిధముగా సహించుచునే నిత్యకర్మానుష్ఠానమున కెట్టిలోపము రాకుండా చూచుకొను చుండిరి. ఆ ప్రకారము నాలుగు నెలలు వారు ద్వారకలో మకాము చేసిరి.

## పీఠాధిపత్య తిరస్కారము

"ఇచ్చటి శంకరాచార్య పీఠమును స్వీకరించు"డని భక్తులు మహారాజ్‌ను ప్రార్థించిరి. కాని మహారాజ్ అందుకు అంగీకారము తెలుపలేదు. రెండు సంవత్సరములు ఆవిధముగా ప్రజలు బలవంతము చేయుచునేయుండిరి. మహారాజ్ ఇక సహించలేక "ఇకపైని యెట్టి బలవంతము చేసినను సహించ"నని ఖండితముగా చెప్పిరి. మహారాజ్ విముఖత్వము చూచి, బలవంతము చేయ గూడదని ప్రజలా విషయమును అంతటితో వదలిపెట్టిరి.

## ద్విసాహస్రి టీకారాచన పరిపూర్తి

ద్వారకలో నుండగా మహారాజ్ ద్రిసాహస్రి యొక్క టీక పదవ అధ్యాయము నుండి మొదలుపెట్టి పూర్తిచేసిరి. మూలగ్రంథము దగ్గర లేకపోయినను ఆ టీక వ్రాయుట పూర్తియైనది. పదునైదు సంవత్సరముల క్రిందట, మూల గ్రంథమైన గురుచరిత్రను మహారాజ్ తమ పూర్వాశ్రమములో, మాణగాంవ్‌లో రచించి యుండిరి. ఆ మూలగ్రంథ శ్లోకములను జ్ఞాపకముచేసికొనుచు వారు టీకాను వ్రాయుట పూర్తి చేసిరి. మూలగ్రంథము దగ్గర లేకుండా ఆ టీకను పూర్తిచేయుట గురించి మహారాజ్ ఆశ్చర్యపడిరి. ఆ విషయమును గూర్చి ఒక లేఖలో వారిట్లు ఉల్లేఖించిరి.

"ఆశ్వీజ బహుళ సప్తమి శక, సం॥ 1821. ద్వారక – సౌరాష్ట్రము. శ్రీక్షేత్ర ప్రభాస. ఇంతకు పూర్వము 9 అధ్యాయముల టీక పూర్తియైయుండెను. ఇక్కడ అనార్త దేశములోని శ్రీక్షేత్ర ద్వారకలో మిగిలిన 14 అధ్యాయములు టీక పూర్తియయ్యెను. ఇంత సుదీర్ఘమైన టీక పూర్తిచేయుటకు నావంటివాడు అసమర్థుడు. రామశబ్దము మాత్రమే నేర్చినవాడు ఇంత గొప్పగా వ్రాయుట

యేమి? వ్రాసినది నేనుగాదు. సాక్షాత్తు దత్తప్రభువే! వారు నా హృదయములో నుండి వారిచ్ఛానుసారము నాచే వ్రాయించిరి. ఈ గ్రంథమునకు కర్తను నేను గాదు. ఇది యంతయు గురుప్రసాదమని భావించవలెను.” ద్వారకలో నుండగా మహారాజ్ ఒక గుజరాతి గృహస్థు కోరినందున గురుచరిత్రపై తాత్పర్యము వ్రాసి ఆయన కిచ్చిరి.

## అభయ ప్రదానము

ఇంతకుముందు మహారాజ్ ఆజ్ఞాపించిన ప్రకారము గాండాబువా తన యింటికి పోయి, తల్లిదండ్రులను ప్రార్థించి, ఎట్టకేలకు వారి అనుజ్ఞపొంది ద్వారకకు చేరెను. మహారాజ్‌ను దర్శించి, నమస్కరించి “మా తల్లిదండ్రులు తమ మరణకాలమున నేను వారిసన్నిధిలో యుండవలెననియు, వారి మరణా నంతరము ఉత్తరకర్మ లన్నియు నేనే చేయవలెననియు, పిల్లల పెండ్లిండ్ల బాధ్యత నేను స్వీకరించవలెననియు మూడు షరతులు విధించి, అవి నేను పాటించెదనని ప్రమాణము చేసిన పిదప ఇచ్చుటకు వచ్చుటకు నాకు అనుజ్ఞ ఇచ్చి”రని ఆయన చెప్పెను. “నీకేమియును భయము లేదు. నీ శ్రద్ధ వలన సమస్త కార్యములు సిద్ధించగల”వని మహారాజ్ గాండాబువాకు అభయమొసగిరి.

## గాండాబువాకు పరీక్ష

ఒకసారి మహారాజ్ గాండాబువాను పరీక్షించదలచిరి. ద్వారక నుండి వారు మరుసటిరోజు ప్రయాణము చేయవలసియుండెను. ఆయన ఆ రాత్రి గాండాబువాను జూచి “బోటులో నీవు ప్రయాణము చేసి బేట్ ద్వారకకు పోయి, శ్రీకృష్ణస్వామిని దర్శించి, ఆదివారము నాటికి ప్రభాసకు తిరిగిరమ్ము. అక్కడ బాలంభట్ ఖేండే కూతురైన ద్వారకాబాయి నా దర్శనము కానందుకు విచారించుచున్నది. ఆమెను ఓదార్చి రాజకోటకు వచ్చి నన్ను కలియుము. వెంటనే బయలుదేరు”మని ఆజ్ఞాపించిరి. ఆ ఆజ్ఞానుసారము గాండాబువా ప్రయాణమునకు సిద్ధమయ్యెను. అక్కడున్నవారు “ఈరోజు శుక్రవారము. రాత్రి బాగుగా పొద్దుపోయినది. ఇంత రాత్రిపూట చీకటిలో నడచిపోయిన భయము వేయును. చాలా దూరము పోవలయును. తీరా అంతదూరము సముద్రము

దగ్గరకు పోయిన తర్వాత అక్కడ బేల్‌ద్వారకకు పోవు బోటు ఉండునో? లేదో? మీరాయనను రేపు ఉదయము పంపిన బాగుండు"ననిరి. ఆ మాటలు విని మహారాజ్ గాండాబువాను చూచి నవ్విరి. సద్గురువు యొక్క అభిప్రాయమేమో ఏకనిష్ఠగల ఆ శిష్యునకు తెలిసివచ్చెను. అప్పటికప్పుడే వెనుకముందు చూడక గుర్వాజ్ఞ శిరసావహించి, ఆయన బయలుదేరెను. అది రాత్రియనియు, దారి కనుగొనుట కష్టమనియు, ఇవేమియును అతడు ఆలోచించలేదు. నిశ్చల మనస్కుడై గురుమహారాజ్‌ను స్మరించుకొనుచు కాలినడకన సముద్రతీరము చేరుకొనెను. అచ్చట ఆసమయములో విచిత్రముగా ఒక బోటు ప్రయాణమునకు సిద్ధముగా నుండెను. గాండాబువా ఆ బోటులో కూర్చుండి రాత్రి సుమారు రెండు గంటలకు "బేల్‌ద్వారక" చేరుకొనెను. అచ్చట నారాయణదాస్ మహత్‌కర్ ఇంటిలో మకాము చేసెను. మరునాడు శనివారము ప్రొద్దున నిత్యకర్మాను ష్ఠానము పూర్తిచేసుకొని శ్రీకృష్ణపరమాత్మను సందర్శించి, అచ్చటనుండి మధ్యాహ్నము బయలుదేరెను. ఆదివారము ఉదయము ద్వారకకు చేరెను. ఈ విచిత్రము గాంచి, మహారాజ్ యొక్క వర్ణనాతీతమైన శక్తిని గ్రహించి, అచ్చటి వారందరు ఆశ్చర్యపడిరి. మహారాజ్ శనివారమే రాజకోటకు వెళ్ళియుండిరి. గాండాబువా ఆనాటి మధ్యాహ్నము ప్రభాస పట్టణమునకు పోయెను. ద్వారకాబాయి యింటికి వెళ్ళి, ఆమెను ఓదార్చి సమాధానపరచుట కెంతయో ప్రయత్నించెను. కాని ఆమె దుఃఖము తగ్గించలేకపోయెను. ఏమి చేయవలెనో తోచక, మరునాడు బయలుదేరి, ప్రాచీన సరస్వతి, గిర్నార్ ప్రదేశములు చూచి రాజకోటలో మహారాజ్ నివసించియున్న ప్రదేశము చేరెను. మహారాజ్ అంతకు ముందే రాజకోటకు వచ్చియుండిరి. వారు గాండాబువాను జూచి "ప్రయాణము లన్నియు సుఖముగా జరిగినవా?" యని ప్రశ్నించిరి. "చిత్తము. తమ దయవలన బాగుగనే జరిగినవి. ఒక్క ద్వారకాబాయి దుఃఖము మాత్రము మాన్పుట నాచేత గాలేదు" అని గాండాబువా చెప్పగా, మహారాజ్ ఆమెను తన దగ్గరకు పిలిపించు కొని, ఉపదేశమిచ్చి ఆమె మనస్సును పూర్తిగా సమాధానపరచిరి. మహారాజ్ దర్శనమాత్రముననే ద్వారకాబాయి మనస్సు శాంతించెను. ఆత్మీయులనుకొన్న భక్తుల విషయములో మహారాజ్ వాత్సల్య మెట్లుండునో ఈ వృత్తాంతము మనకు వెల్లడించుచున్నది.

## దయానంద సరస్వతి శిష్యుడు

మహారాజ్ దర్శనార్థము రాజకోటలోని ఆంగ్లభాషా నిష్ణాతులు, అధికారులు, రాజోద్యోగులు మున్నగు వారెందరెందరో వచ్చుచుండిరి. మహారాజ్‌ను దర్శించి నంతనే వారి చరణారవిందములకు 'దాసోహ'మగు చుండిరి. ఒకరోజు మహారాజ్ ఏకాంతముగానున్న సమయములో శ్రీ దయానంద సరస్వతి శిష్యుడొకడు వారి దగ్గరకు వచ్చి, వారిని అధిక్షేపించుట మొదలుపెట్టెను. అప్పుడు మహారాజ్ పరమ శాంతముగా "నాయనా! నీవెవరో? మనకెట్టి సంబంధము లేదు. ఎందుకిట్లు కఠినముగా మాట్లాడుచున్నావు? నీకంతగా నాపై కోపము వచ్చి, కొట్టవలెనని యున్నచో, కొట్టి, నీ కోరిక తీర్చుకొమ్ము" అని పలికి, వాని ముందు వంగి, తమ వీపును చూపిరి. అతడు మహారాజ్‌ను కొట్టుటకు సిద్ధపడెను. అంతలో ఆ దృశ్యము నంతయు నెదురుగానున్న మేడపైనుండి చూచుచున్న స్త్రీ ఒకతె, ఆ వ్యక్తి మహారాజ్‌ను కొట్టునన్న ఆతురతతో పెద్దగా కేకపెట్టి అందరిని పిలుచుచు, గబగబ క్రిందికి వచ్చెను. జనులందరు పరుగెత్తుకొని వచ్చుట చూచి, ఆ దయానంద సరస్వతి శిష్యుడు కాలికి బుద్ధిచెప్పెను.

## సిద్ధపురవాసులను మందలించుట

రాజకోట నుండి మహారాజ్ బయలుదేరి బడవాణ, విరంగాంవ్ గ్రామముల మీదుగా సిద్ధపురము చేరిరి. గాండాబువా కూడా మహారాజ్ వెంట యుండెను. అచ్చట యున్న సరస్వతీ నదిని స్తోత్రముచేసి, నమస్కరించి ఆ గ్రామములోనున్న హాటకేశ్వర మందిరములో మహారాజ్ నివసించిరి. అచ్చట వారు మూడునెలలుండవలసి వచ్చెను. దత్తజయంతి ఉత్సవములను వారచ్చట మహావైభవముగా జరిపించిరి. నిత్యము భగవద్గీతా ప్రవచనములు చేయుచుండిరి. పాట్నా నుండి భంభం మహాదేవ సరస్వతీయను పేరుగల సన్యాసి యొకరు మహారాజ్‌ను దర్శించవలయునని సిద్ధపురమునకు వచ్చెను. ఆయన కోరిక ప్రకారము మహారాజ్ ఆయనకు రుద్రభాష్యమును బోధించి, కొంత వేదాంతమునుగూడ నెరుకబరచిరి. అచ్చట ఎందరో సన్యాసులు, బ్రహ్మచారులు నివసించుచుండిరి. వారిలో నొక బ్రహ్మచారి, సంగ్రహణి వ్యాధిచే

పీడించబడి నీరసించెను. "ఆ బ్రహ్మచారి తిండితిప్పలు విషయము కొంచెము చూచుచుండు" డని మహారాజ్ అచ్చటి వారికి చెప్పిరి. కాని వారెవరును మహారాజ్ మాటను లక్ష్యపెట్టకుండుట గమనించి, వారు గాండాబువాను "పది పదిహేనురోజుల పాటు ఇతనిని కనిపెట్టియుండు"మని ఆదేశించిరి. గాండాబువా ఆ బ్రహ్మచారికి మహారాజ్ చెప్పిన విధముగా, శ్రద్ధగా ఉపచారములు చేయుచుండెను. పదు నైదురోజులకా బ్రహ్మచారి అంత్యకాలము సమీపించెను. ఆ విషయము గ్రహించి మహారాజ్ అతని దగ్గరకు పోయి "నీ దగ్గర గల గంగాజలమును శరీరమునకు రాచుకొని, కొంత తీర్థముగా పుచ్చుకొనుము. ఆ తర్వాత నామస్మరణముచేయ" మని చెప్పిరి. ఆ బ్రహ్మచారి మహారాజ్ చెప్పిన ప్రకారము చేసెను. కొంచెము సేపటిలోనే "దత్త దత్త"యని స్మరించుచు మహారాజ్ వంక నిశ్చలముగా జూచుచు అతడు ప్రాణములు విడిచెను. సజ్జన సంగతిచేత అతనికి సద్గతి లభించెను. తరువాత మహారాజ్ గ్రామములోని గృహస్థులను పిలిపించి "మీరు అలసత్వము వహించి పట్టించుకొనకపోవుట వలన నేమైనదో చూచితిరి గదా!" యని అపగత ప్రాణుడైన ఆ బ్రహ్మచారిని చూపించుచు మందలించిరి. అందరును తలలు వాల్చి "క్షమించుడు. ఇకముందు మా యావచ్ఛక్తితో అతిథి సత్కారములు చేయుచుందు"మని వాగ్దానము చేసిరి.

## దుర్మార్గుని సన్మార్గుడుగా మార్చుట

సిద్ధపురములో కృష్ణంభట్ వైజాపూర్కర్ అను పేరుగల గృహస్థుడొకడు నివసించుచుండెను. అతనికి దుర్జన సాంగత్యముచే గంజాయి త్రాగు వ్యసన మబ్బెను. రాత్రియనక పగలనక అతడు సదా గంజాయి నిషాలోనే యుండెడి వాడు. మగని దుస్థితి జూచి ఆయన భార్య మిగుల విచారించుచు, మహారాజ్ శరణుజొచ్చి "నా మగని దురభ్యాసము తొలగిపోవుట కేదైనను ఉపాయము చెప్పు"డని ప్రార్థించెను. ఆమె మాటలు విని సదయులై "అతని మెడలో గట్టు"మని ఒక తాయెత్తు, తినుటకు కొన్ని మాత్రలు మహారాజ్ ఇచ్చిరి. మహారాజ్ చెప్పిన ప్రకారము కృష్ణంభట్ తన మెడలో తాయెత్తు కట్టుకొని, మాత్రలు సేవించుచుండెను. ఒకరోజు ఆయన మహారాజ్ దర్శనమునకై వచ్చెను. అతనిని

చూచినతోడనే మహారాజ్ "ఇన్ని రోజులకుగాను ఈ రోజు దర్శనమిచ్చితివి. ఏవి విశేష?"మని ప్రశ్నించిరి. ఆ మాట విని అతడు సిగ్గుపడి, మహారాజ్ మ్రోల సాష్టాంగపడి "మీ దయచేత చెడు సహవాసములు వదలిపెట్టితిని. నామీద దయజూపి, నా సేవ నంగీకరింపు"డని ప్రార్థించెను. అతనిపై వాత్సల్యము కలిగి మహారాజ్ అతనికి మంత్రోపదేశము చేసిరి. తదుపరి అతడు మహారాజున కత్యంత ప్రియభక్తుడయ్యెను. ప్రతి సంవత్సరము మహారాజ్ ఎచ్చటినుండినను అచ్చటకుపోయి, దర్శనము చేసికొని వచ్చుచుండెను. గురుకృపచే క్రమక్రమముగా నతనికి వైరాగ్యము ప్రబలెను. చివరకు జ్వరము వచ్చినప్పుడు అతడు ఆతుర సన్న్యాసము తీసికొనెను. అంత్యకాలము సమీపించినదని గమనించి, తన యింటిలోని వారినందరిని భోజనము చేయుడని చెప్పెను. వారందరు భోజనము చేయుటకు పోయిరి. అప్పుడు కృష్ణంభట్ లేచి, రణఛోడ్‌జీమూర్తి ముందు కూర్చుండి మహారాజ్‌ను ధ్యానించుచుండెను. తర్వాత ప్రణవోచ్చారము పెద్దగాజేసి హఠాత్తుగా ప్రాణము విడిచెను. మహారాజ్ దయచేత అతనికి సద్గతి లభించెను.

## మహారాజ్ రెండవసారి శినూర్ పోవుట

సిద్ధపురము నుండి దత్తజయంతి తరువాత మహారాజ్ బయలుదేరి ఢాకూర్ చేరిరి. తాము ఢాకూరుకు చేరనున్నట్లు ముందుగనే రామశాస్త్రికి లేఖ మూలముగా మహారాజ్ తెలిపియుండుటచే, రామశాస్త్రి తన బంధువైన బాలకృష్ణశాస్త్రిని, మహారాజ్ దగ్గర అంతకుముందు శినూర్‌లో యోగశాస్త్రము నేర్చుకొన్న ఒక గుజరాతీ బ్రాహ్మణుని వెంటబెట్టుకొని మార్గశిర బహుళ విదియనాటికి ఢాకూరు చేరుకొనెను. అచ్చట వారు మూడురోజులుండిరి. కాని మహారాజ్ అచ్చటికి రాలేదు. "ఎవరు ప్రయాణమై తిరిగి పోదలచుకున్నారో వారు పోవచ్చు" నను మాట వారికి వినిపించెను. వారు సంభ్రమముతో వాకిలివైపు చూడగనే మహారాజ్ దర్శనమిచ్చిరి. మహారాజ్ ముందు వారు సాష్టాంగపడిరి. స్నాన సంధ్యానుష్ఠానమైన తరువాత మహారాజ్ ద్విసాహస్రి గ్రంథమును "చదువు"మని రామశాస్త్రి కిచ్చిరి. ద్వారకలో ఇటీవల తాము రచించిన టీకపై వారు కొంత వివరణ పూర్వకముగా నుపన్యసించిరి.

కొంతసేపైన తరువాత తులసీ బృందావనము గద్దెపై కూర్చుండి, "వేదపనస నొకదానిని చెప్పు"మని రామశాస్త్రిని కోరిరి. అతడా ప్రకారము వేదపనస చెప్పగనే, దానికి జట, ఘన, పంచసంధి, రథక్రమము, దండక్రమము ఇత్యాది వికృతులు మహారాజ్ చెప్పి చూపించి, రామశాస్త్రి ముఖతః తిరిగి అనిపించిరి.

మరునాడు ఉదయమున శౌచముఖమార్జనమైన పిదప మహారాజ్ రామశాస్త్రిని వెంటబెట్టుకొని గోమతీ నదీతీరమునకు పోయిరి. నదిలో నీరు స్వల్పముగానున్నను స్నానము చేసివచ్చిరి. అటు పిమ్మట "ఢాకూర్‌నాథ్ దర్శనమునకు వెళ్ళుదమా?" యని రామశాస్త్రి యడుగగా మహారాజ్ వలదనిరి. మహారాజ్ ఆవిధముగా వలదనుటకు ఒక కారణమున్నది. క్రితము రోజు సాయంకాలము మహారాజ్ ఢాకూర్ చేరిన వెంటనే ఒక భజనచేయు స్త్రీ చెప్పిన ప్రకారము వారు ఢాకూర్‌నాథ్ దర్శనమునకై మందిరమునకు పోయిరి. అది ద్వారము మూసెడి సమయము కాకపోయినను మహారాజ్ వెళ్ళిన సమయమున మందిర ద్వారము మూయబడియుండెను. అది చూచి, ఢాకూర్‌నాథ్ దర్శనప్రాప్తి తమకు లేదని వారు నిశ్చయించి తిరిగివచ్చిరి. ఆ కారణము వలన రామశాస్త్రి దేవాలయమునకు పోదమనగా వారు వలదనిరి.

ఆరోజు సాయంకాలము వరకు మహారాజ్ అందరితోడను ముచ్చటించు చునే యుండిరి. ఐదుగంటలు కాగానే సంభాషణ కట్టిపెట్టి, అకస్మాత్తుగా లేచి, దండ కమండలములు పట్టుకొని ప్రయాణమగుటకు సంసిద్ధమయినది. అంత త్వరితముగా మహారాజ్ ఆ ప్రదేశము వీడుదురని ఎవరును అనుకొనలేదు. అదిచూచి అందరును ఆశ్చర్యపడిరి. "రెండు మూడు రోజులుండు"దని ఎంతయో బలవంతము జేసిరి. ఆ మాటలు వినిపించుకొనక మహారాజ్ రామశాస్త్రిని చూచి "లెండు! వెళ్ళుద"మని బయలుదేరిరి. రామశాస్త్రి ఆయనను "శినోరా" రమ్మని బ్రతిమిలాడెను. "ఒకసారి వచ్చితినిగదా! ఇంకను అక్కడేమున్న"దని వారనిరి. ఆ మాటవిని రామశాస్త్రి "సరే! మీరెచ్చటకు పోయెదరో నేనచ్చటకు వత్తును. మిమ్ములను వదలి నే నుండలే"నని రామశాస్త్రి అనెను. ప్రేమాతి శయముతో గూడిన రామశాస్త్రి మాటలకు లోబడి మహారాజ్ శినోరా వచ్చుట కంగీకరించిరి. "నేను నడచివచ్చెదను. నీవు రైలుమీద రమ్ము" అని మహారాజ్ రామశాస్త్రితో ననెను. రామశాస్త్రి అందుల కంగీకరించక "నేనును మీతోబాటు

కాలినడకనే వచ్చెద”నని మహారాజ్‌ను వెంబడించెను. అప్పుడు మహారాజ్ వెంటనే వెనుకకు తిరిగి, కోపముతో “చెప్పినట్లు చేసెదవా? లేదా?” అని బెదరించిరి. మహారాజ్ కోపము చూడగనే రామశాస్త్రికి భయము వేసెను. “తప్పైనది” అని వెనుకకు మరలెను.

ఆరాత్రి రైలుమీద రామశాస్త్రి బడోదకు చేరి, మార్గ శీర్ష్య బహుళ అష్టమి నాటికి శినోరా చేరెను. ఆయనను చూచి, అక్కడివారు “నీవు మహారాజ్ దర్శనార్థము  ఢాకూర్ వెళ్ళితిని. కాని మొన్న సాయంకాలము ఇచ్చటకు మహారాజ్ వచ్చిరి. నర్మదాతీరమున వారున్నారు” అని పలికిరి. ఆ మాటలు విని రామశాస్త్రి మహారాజ్ సిద్ధశక్తికి ఆశ్చర్యపడెను. షష్ఠి సంధ్యాసమయమున, ఐదుగంటలకు ఢాకూర్ నుండి బయలుదేరిన మహారాజ్, అప్పటికప్పుడే గంట గంటన్నరలో శినూర్ చేరుట అది వారి సిద్ధశక్తికి ప్రబల నిదర్శనము. మహాశక్తులు కలిగియున్నను వారు వారి జీవితకాలములో మూడు నాలుగు పర్యాయములు కన్న ఎక్కువ సారులు వారు తమ శక్తిని ప్రదర్శించి యుండలేదు. సంధ్యావందననానంతరము రామశాస్త్రి మహారాజ్ దర్శనమునకై పోయెను. మహారాజ్ రామశాస్త్రిని చూచి నవ్విరి. తనను వారివెంట ఎందుకు రానీయక, రైలుమీద రమ్మనిరో రామశాస్త్రికి అప్పుడు అర్థమయ్యెను.

మహారాజ్ ఈ విధముగా రెండవ పర్యాయము శినోర్‌కి వచ్చినప్పుడు అచ్చట మూడు నెలలుండిరి. ఆ కాలములో మహారాజ్ దగ్గర రామశాస్త్రి విద్యాభ్యాసము అధితకరముగా సాగెను. ఒకసారి మహారాజ్ రామశాస్త్రితో “ఇంత వరకు నీవు అభ్యసించిన విద్యను జాగ్రత్తగా దక్కించుకొన్నచో నీకు మునుముందు చాల ఉపయోగించు”ననిరి. వెంటనే రామశాస్త్రి “మీ మాటలు విని మీరిక్కిడ  ఎక్కువ కాలముండరేమో ననిపించుచున్నది. దయచేసి నన్ను కూడ మీవెంట తీసుకొని పొండు” అనెను. మరల నీకు నా దర్శనము కాగలదు. అప్పటినుండి చెప్పిన ప్రకారముగనే ఆ తరువాత గరుడేశ్వరములో, మహారాజ్ సమాధికాల పర్యంతము రామశాస్త్రి మహారాజ్ దగ్గరనే యుండెను. శినోర్‌లో చెప్పిన మాటలలోని గూడార్థము అప్పుడు రామశాస్త్రికి తెలిసివచ్చెను.

## జగల

జగలయను పేరుగల ఒక తెలుగువాడు శినోర్‌లో నుండెను. అతనికి

వివాహము చేసుకొను నిచ్చలేక యిల్లువదలి ఆయూరు వచ్చెను. ఎండకు వానకు నోర్చుకొనుచు, జడభరతునివలె దేహభ్రాంతి లేకుండ, రెండు సంవత్సరముల కాలము గడపెను. ఒక సమయమున మహారాజ్ ఆ గ్రామములో నివసించుచున్నప్పుడు వారు నదిలో స్నానముచేసి వచ్చుచుండగా అతడు వారికి ఎదురుగా వచ్చి, రెండు చేతులు చాపి వారి నడ్డగించెను. మహారాజ్ అతనిని జూచి "నీవు ఇక్కడ ఉండెడివాడవే గదా! ఈ వేళ రాత్రికి మార్కండేయ మందిరమునకు ర"మ్మని చెప్పి ముందుకుసాగిరి. ఆ సాయంకాలము మందిరములో మహారాజ్ తమ దగ్గరున్న జనమును చూచి "ఈరోజు రాత్రి నుండి మీకు భగవద్గీత పురాణము చెప్పుదు"నని చెప్పిరి. పురాణ శ్రవణమునకై ఆ రాత్రి జనులెల్లరు మందిరమునకు వచ్చిరి. అందరికన్నను ముందు జగల వచ్చి ఒక మూల కూర్చుండియుండెను. ప్రతిదినము జగల నియముమగా గీతాశ్రవణము చేయుచుండెను. గీత యొక్క పదిహేడు అధ్యాయములు మహారాజ్ చెప్పినంతనే జగల తృప్తిచెంది "అంతయు వింటిని. ఇక ఇచ్చటకు రావలసిన అవసరము లే"దని మహారాజ్‌తో పలికి, సాష్టాంగ నమస్కారములు చేసి వెడలిపోయెను. అటు పిమ్మట మూడు నెలల కతడు మరణించెను.

## వినాయక్ ఉద్యోగ ప్రాప్తి

ఆ సంవత్సరము ఆ ప్రాంతములో వానలు కురియనందున కలరా వ్యాధి ప్రబలెను. అనేకు లావ్యాధిచే మరణించుచుండిరి. అప్పుడు మహారాజ్ వెంబడి గాండాబువా యుండిరి. తమ దగ్గరకు వచ్చెడి రోగార్తులకు గాండాబువా ద్వారా ఔషధము లిప్పించుచు వారి రోగబాధలు నివారణ చేయుచుండిరి. ఆ ప్రాంతములో అడవిలో కట్టెలు కొట్టించి, కట్టెల వ్యాపారము చేయువారు చాలామంది యుండిరి. వారిలో కబాడీ దాదా యను సుప్రసిద్ధ వ్యాపారి ఒకడుండెను. ఆయన కుమారుడు వినాయక్ తాను పరీక్షలో కృతార్థుడు కానందున విచారముతో మహారాజ్ దగ్గరకు వచ్చి "నేను పరీక్షలో తప్పితిని. నాకిక ఉద్యోగమెట్లు దొరకును? ఉద్యోగము దొరకకున్న చాలా కష్టమగును. దయచేసి ఎటులైనను నాకు ఉద్యోగము దొరకునట్లు చేయు"డని ప్రార్థించెను. మహారాజ్ ఒక మంత్రము విధిపూర్వకముగా వ్రాసియిచ్చి, అనుష్ఠానము

చేయుమని చెప్పిరి. అతడా మంత్రమును శ్రద్ధగా అనుష్ఠానము చేయగనే అచిర కాలములోనే ఒక పెద్ద ఉద్యోగి అతనిని పిలిపించి, అతని తండ్రి చేసిన ఉద్యోగములో అతనిని నియమించెను. శ్రద్ధాభక్తులుండవలయునే కాని మంత్రశక్తి ప్రభావ మేకాలము నందైనను గోచరించును.

అవధూతచింతన శ్రీ గురుదేవదత్త

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

ఇరువదియొటవక అధ్యాయము సంపూర్ణము.

(సశేషం)

# కథాసూక్తము

గురువు ఎడల భక్తి శ్రద్ధలు కలిగి వుండడం గురించి ప్రస్తావన వచ్చినప్పుడు ఛత్రపతి శివాజీ గురించి చెప్పారు స్వామి. అతనికి దేశభక్తి, దైవభక్తి, గురుభక్తి మెండుగా ఉన్నాయి. సమర్థ రామదాసు శివాజీ యొక్క గురువు. ఒక సందర్భంలో తనకు రాజ్యకాంక్ష లేదని తన రాజ్యాన్ని గురువుకు సమర్పించాడు. రాజ పట్టాభిషేకం చేసాడు. గురువు అయిన సమర్థ రామదాసు అది స్వీకరించి తన ప్రతినిధిగా శివాజీని రాజ్యాన్ని పరిపాలించమన్నారు. ఆనాటి దేశ పరిస్థితులకు అనుగుణంగా ఆ నిర్ణయం తీసుకుని గురువుకు దేశరక్షణకు తోడ్పడ్డారు.

సత్యసాయిబాబా చెప్పిన ఒక కథ స్వామి చెప్పారు. ఒకాయన దగ్గర ఇంటిపనికి కొంతమంది పనిచేస్తుండేవారు. వాళ్ళకి రోజు కూలీ ఇచ్చి పని చేయించుకునేవాడు. వాళ్ళలో ఒకతను మాత్రం అన్ని పనులు చేసేవాడు కాని కూలీగా పని చేయలేదు. ఆ యజమాని అతనిని కొడుకులా ఆదరించాడు. అంటే మనం కోరికలకు పరిమితమయితే ఫలితం ఆ విధంగా ఉంటుంది. అదే శరణాగతి పొందితే అన్ని గురువే చూసుకుంటాడు.

# సత్యసాయి విశ్వశాంతిదాయి

- డాక్టర్ ఎన్.నారాయణ రావు

రిటైర్డ్ ప్రొఫెసర్, శ్రీ సత్యసాయి యూనివర్సిటీ, పుట్టపర్తి

1 సత్య ధర్మ ప్రేమ శాంతి స్థాపింప
పర్తియందు బాబ అవతరించె
వేదపురుషుడతడు దత్తావతారుడు
సత్యసాయి! విశ్వశాంతిదాయి!

2. విశ్వసృష్టి కర్త, విశ్వంభరుడు బాబ
విశ్వరక్షకుండు, విశ్వగురువు
భక్తబాంధవుడు, భవభయహరణుడు
సత్యసాయి! విశ్వశాంతిదాయి!

3. చిన్నతనమందె ఎన్నెన్నో లీలలు
చూపి, జనుల బాధ బాపినాడు
పరమ ప్రేమ మూర్తి, కరుణాసముద్రుడు
సత్యసాయి! విశ్వశాంతిదాయి!

4. హంపీ క్షేత్రమందు శివలింగమందున
దర్శనమొసగి తనదు శక్తి
భువిని చాటినట్టి పురుషోత్తముడు బాబ
సత్యసాయి! విశ్వశాంతిదాయి!

5. లలిత ఉదరబాధ తొలగించివేసెను
పాదసేవ చేయు భాగ్యమొసగె
కంటి రెప్పలాగ కాపాడు దైవము
సత్యసాయి! విశ్వశాంతిదాయి!

6. మరణమొందినట్టి వాల్టర్ కోవన్‌కు
మరల జన్మనిచ్చిన వరదుడతడు
సాయికి యిలలోన సాధ్యంబుగాదేది?
సత్యసాయి! విశ్వశాంతిదాయి!

7. కుప్పలుగ విభూతి ఉష యింటి లోపల
చిత్రపటములందు చేర్చి బాబ
అభయమొసగి సాయి శుభము చేకూర్చె
సత్యసాయి! విశ్వశాంతిదాయి!

8. సాయిభజన కలుపు సర్వులనొకచోట
మనుషులేకమైన మదికి శాంతి
శాంతియున్న ధాత్రి భూతల స్వర్గమౌ
సత్యసాయి! విశ్వశాంతిదాయి!

**గమనిక**

చందాదారులు తమ సభ్యత్వాన్ని సకాలంలో పునరుద్ధరించుకోవాలి. తమ రచనలను, చందాను (మనీ ఆర్డరు ద్వారా కాని, బేంకు చెక్కు ద్వారా కాని) ఈ దిగువ అడ్రసులకు **విశ్వమానవ సమైక్యతా సంసత్** (Viswamanava Samaikyata Samsat) 'విశ్వమందిరం', 3వ లైను, కృష్ణనగర్, గుంటూరు – 522 006. వెబ్‌సైట్ : www.viswaguru.com లేక పి. రామగోపాలరావు (P. Ramagopala Rao), 3–5–1092/2, వెంకటేశ్వర కాలనీ, నారాయణగుడ, హైదరాబాదు – 500 029, Phone : 040-24755674. పంపవలెను. K.K. Gupta, Cell : 9848414585, kkguptaca@gmail.com ఇదే అడ్రసుకు 'విశ్వసూక్తము' అందని చందా దారులు తెలుపవలెను.

## స్త్రీసూక్తము

# ఉభయభారతి

జగద్గురు శంకరాచార్య స్వామివారి జీవన పయనం గురించి అధ్యయనం చేసినప్పుడు ఉభయభారతి అనే స్త్రీమూర్తి యొక్క ప్రస్తావన ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. అపర శంకరులైన స్వామివారికి వేద వేదాంగములయందు గల జ్ఞానమును, సిద్ధాంతములలోని అవగాహన, వాదపటిమను పడిగట్టగల జ్ఞానవంతురాలు ఉభయభారతి. ఆమె మిథిల (ప్రస్తుత బీహారు)లోని మహిషి గ్రామంలో నివాసమున్న మైథిలి బ్రాహ్మణ వంశంలోని మండనమిశ్రుడి ధర్మపత్ని. ఆ దంపతులు సకల విద్యాపారంగతులు, వైదిక విధానంలో జీవనం గడుపుతూ గృహస్థాశ్రమ విధులను నిర్వహిస్తూ దేవతలు, ఋషులు, పితృదేవతలను సంతృప్తి పరచడానికి క్రతువులు, యజ్ఞములను నిర్వహిస్తుండేవారు. వారు ఆత్మవిచారణకు సంబంధించిన మీమాంస సిద్ధాంతమును అనుసరించినవారు. వారి ఇంటికి దారి ఎవరినైనా అడిగితే చాలా సులభం అంటూ చెప్పేవారు. ఏ ఇంటిముందు ఉన్న గుమ్మంకు ఇరువైపులా ఉన్న పంజరాలలోని చిలకలు వేదాలు వల్లిస్తూ వాటి ప్రామాణికత గురించి, కర్మలు ఫలితమును స్వయంగా ఇవ్వగలవా లేక భగవంతుడు యొక్క ప్రమేయము అవసరమా, ఈ జగత్తు శాశ్వతమా లేక మిథ్యయా అలా అనేక వేదాంత విషయాల గురించి మాట్లాడుతుంటాయో అదే మండనమిశ్రుడు యొక్క గృహము అని చెప్తారు.

మిథిలలోని వారంతా ఉభయభారతిని సరస్వతిదేవి యొక్క అవతారముగా భావించేవారు. పూర్వమీమాంస సిద్ధాంతములో పాండిత్యము గల కుమారిలభట్టుతో శంకరాచార్యులు తాను ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతమును ప్రాచురింప జేసే ఉద్దేశంతో వాదన చేసి ఆయనని ఓడించారు. అప్పుడు కుమరిలభట్టు తన శిష్యుడైన మండనమిశ్రునితో వాదన చేసి అద్వైత సిద్ధాంతమును వ్యాపింప చేయమన్నారు. ఆ సందర్భంగా శంకరులు తమ శిష్యబృందంతో వెళ్లి మండనమిశ్రుడుతో వాదనకు సిద్ధమయ్యారు. అప్పుడు

ఈ ఇద్దరి మధ్య జరిగే వాదప్రతివాదనలకు న్యాయనిర్ణేతగా ఉభయభారతిని వ్యవహరించమని శంకరాచార్యులు ప్రతిపాదించారు. దానిబట్టి ఆమెయొక్క జ్ఞానసంపద, విషయ ప్రావీణ్యత, విజ్ఞత, నిష్పాక్షికత విదితమవుతాయి. ఈ వాదనలో ఓడినవారు గెలిచినవారికి శిష్యులుగా మారాలి అని శంకరాచార్యులు షరతు విధించారు. ఆ విధంగా వారిరువురి మధ్య వాదన సాగింది. మండనమిశ్రుడు బ్రహ్మ అంశతో జన్మించిన కారణంగా ప్రతిభా వంతంగా తన వాదనలను వినిపించాడు. చివరకు శంకరాచార్యులు విజయం పొందారని ఉభయభారతి ప్రకటన చేసింది. భర్త ఓడి పోయాడని సంకోచించ కుండా నిష్పక్షపాతంగా చెప్పింది. ఆమె యొక్క న్యాయవర్తనమునకు శంకరాచార్య ఆమెను ఎంతో శ్లాఘించారు.

మండనమిశ్రుడు ఓటమిని అంగీకరించి సన్యసించాడు. కాని ఉభయభారతి అతని అర్ధాంగిగా తనతో కూడా ఆచార్యులవారు వాదన చేసి విజయం సాధించినప్పుడే పూర్తిగా గెలుపొందినట్లవుతుంది అని నిర్భయంగా శంకరాచార్యతో అన్నది. దానితో కొన్ని రోజులు వారిరువురి మధ్య వాదన నడిచింది. బ్రహ్మచారిగా ఉండి లైంగికసుఖం అనుభవంలో లేకుండా వేదములలో చెప్పబడిన ప్రాపంచిక జ్ఞానము తెలుసునని ఎలా చెప్పగలరు అని ఆమె అడిగింది. కామశాస్త్రము గురించిన అవగాహన లేనప్పుడు వైదిక జ్ఞానము కలిగినట్టు కాదు అని అంది ఆమె. దానికి శంకరాచార్య ఒక నెలరోజుల సమయం కోరారు సమాధానం చెప్పడానికి. వారికి పరకాయ ప్రవేశ విద్య తెలుసు కాబట్టి అమరు అనే రాజు చనిపోగా అతని శరీరంలో ప్రవేశించి జీవితుడై ఆ జీవనం ద్వారా కామము గురించి తెలుసుకుని నెల రోజుల తరవాత ఆ విషయము గురించి ఒక గ్రంథము వ్రాసి ఉదయభారతికి ఇచ్చారు. ఆమె తన ఓటమిని అంగీకరించి తాను కూడా సన్యసించింది.

ఆ దంపతులు తరవాత జ్ఞానమార్గము గురించి ప్రచారంచేస్తూ జ్ఞానమును పొందకపోయినచో మానవజీవితమునకు విలువ లేదని ప్రబోధించారు. ఆత్మయొక్క ప్రకాశమును గ్రహించుటకు మనసులోని అహంకారమనే పొరను తొలగించాలి అని ఉభయభారతి ప్రభోదించింది.

తరవాత కాలంలో ఆమె గంగానది తీరంలో ఆశ్రమంలో నివసిస్తూ మహిళలకు ఆధ్యాత్మిక ప్రభోధములను చేస్తుండేది. ఎంతోమంది స్త్రీలు ఆమె వద్ద శిష్యురాళ్ళుగా చేరారు. ప్రతిరోజు గంగానదిలో సాన్నం ఆచరించి వస్తుండేది. ఆ దారిలో బ్రహ్మజ్ఞాని అని పిలవబడే ఒక సన్యాసి ఉండేవాడు. ఆయన అన్నింటిని త్యజించినవాడు, గొప్పజ్ఞాని. అయినా ఆయనకు మంచినీళ్ళు పెట్టుకున్న ఒక కుండ అంటే చాలా మక్కువగా ఉండేది. ఒక రోజు ఆ సన్యాసి ఆ కుండని ఎవరైనా దొంగిలిస్తారేమోనని తన తలకింద పెట్టుకుని పడుకున్నాడు. అది ఉభయభారతి చూసి తన శిష్యబృందంతో అంది 'అన్ని వదులకున్నవాడు ఆ మట్టికుండ మీద మమకారంతో తలకింద పెట్టుకున్నాడు' అని. ఆ మాటలు విని అతనికి కోపం వచ్చి ఆమె తిరిగి వస్తుంటే ఆ కుండ మీద వ్యామోహం లేదని చెప్పడానికి దానిని విసిరికొట్టాడు. అది చూసి 'ఆయనకి అభిమానం అనే లోపం మాత్రమే ఉందనుకున్నాను, కాని ఆయనకి అహంకారం అనే ఇంకో లోపం కూడా ఉందని ఇప్పుడు తెలిసింది. అభిమానం, అహంకారం కలిగిన వాడు జ్ఞాని ఎలా అవుతాడు' అని అంది. ఆ మాటలు విన్న సన్యాసికి జ్ఞానోదయం అయింది. జ్ఞానమార్గమును ప్రభోదిస్తూ ఆమె దేశం యొక్క అన్ని వైపులకు పయనం సాగించింది.

**సేకరణ : సూర్యారావు**

## 'చందాదారులకు గమనిక'

**టెలిఫోను/మొబైలు ఫోను సౌకర్యం ఉన్న చందాదారులు వాటి నెంబర్లను శ్రీ కె.కె.గుప్త (9848414585) గారికి ఫోను చేసి తెలియ పరచవలసింది. లేఖ ద్వారా పి. రామగోపాలరావు, 3-5-1092/2, వెంకటేశ్వర కాలనీ, నారాయణగూడ, హైదరాబాదుకు పంపవలసింది. విశ్వసూక్తము సంచిక ఒకటి కన్న ఎక్కువ అందుతున్నట్లైతే ఆ విషయాన్ని శ్రీ కె.కె. గుప్తా గారికి తెలియ జేయవలసింది.**

# విశ్వహృదయార్చన

(గత సంచిక తరువాయి)

కామము–కోరిక. ఈ కోరిక స్త్రీ సంబంధమైనది కావచ్చును. లేదా ఇతరములైన కోరికలు కావచ్చును. ఏది అయినా అది కామమని పిలువబడుతోంది. మానవుణ్ణి జన్మజన్మల ప్రారబ్ధకర్మల వాసనా బలాలు దిగజారుస్తుంటాయి. అగ్ని తగలడం వల్ల గడ్డి పరకలు భగ్గున అతిత్వరగా క్షణాల మీద మాడిపోతాయి. అల్పమైన గడ్డి క్షణాల్లో కాలి బూడిదయైనట్లు, కామవాంఛ విచక్షణా రహితంగా క్షణకాలంలో మానవుణ్ణి కాల్చివేస్తుంది. జన్మజన్మల వాసనా బలాల ఫలితం బలీయంగా మానవుణ్ణి వెన్నంటి ఉంటుంది. అటువంటప్పుడు భగవంతుణ్ణి గురించి ఆలోచించాలన్న ఇంగిత జ్ఞానం కలుగదు. రాముడుండు చోట, కాముడుండడానికి వీలులేదు. గనుక ఆ విధంగా జరుగుతుంది. దైవీభావాల్ని హృదయంలో పదిలపరచుకొన్ననాడు, ఆ పరమాత్మను హృదయంలో బంధించిన వారి హృదయము నుండి వాసనా మయమైన కోరికలు సర్వం పారిపోతాయి.

తాత్కాలికమైన సుఖాన్ని అనుభవించాలని మనస్సు కోరుకుంటుంది. క్షణికమైన భౌతిక సుఖాల వెంట మానవుడి మనస్సు పరుగు లిడడానికి ఇష్టపడుతుంది. అందుచేత మనస్సును అదుపులో నుంచుకుంటూ భౌతిక సుఖాలు, తాత్కాలికమైన సంతోషం, పశుప్రవర్తన పట్ల ఆసక్తి కనబరచకుండా కోరికల్ని తగ్గించుకొని, భగవదారాధన, భగవన్నామస్మరణ, అర్చన, ఆరాధనలు సల్పుతూ క్రమక్రమంగా పశుప్రవర్తనను ప్రక్కకు నెడుతూ పశుపతి నాశ్రయిస్తే శాశ్వతానందం కలుగుతుంది. ప్రాథమిక దశలో భగవంతుణ్ణి అర్చిస్తూ పూజిస్తూ భౌతికమైన ఆరాధనా విధానం అనుసరించి ముందుకు సాగడానికి ప్రయత్నం చేసే సాధనా మార్గాన్ని అలవరచుకొంటే రాముడు ప్రక్కనుండి కాముణ్ణి దూరంగా నెట్టుతాడు. ఏ మంచిపని చెయ్యాలన్నా భగవంతుణ్ని ఆశ్రయించే తీరాలి. లేదా సద్గురువును చేరి తరించే మార్గాన్ని చూపమని ప్రార్థించాలి. గురువు అడుగుజాడల్లో నడుస్తూ సద్గ్రంథ పఠనం ద్వారా, సత్సంగం ద్వారా కాముణ్ణి

నెట్టివేసి రాముణ్ణి సర్వస్వంగా భావించి ముందుకు నడిపించమని వేడుకోవాలి. బాహ్యపూజ అంతరంగ పూజగా మారాలి. ఈ రచయిత చేసిన పని అదే. అనేకానేక దశలు వాటి ఆత్మ సాక్షాత్కారం పొందే స్థాయికి ఈ సద్గురువు శ్రీ విశ్వయోగి ఎదిగి, ఒదిగి ఒదిగి ఉంటూ విశ్వశాంతికి ఎనలేని కృషి సల్పుతున్నారు. బాహ్యం పట్ల ఆసక్తి విడనాడినారు. అంతరంగ శుద్ధి సాధించారు. త్యాగధనులుగా మారినారు. ఆ విధంగా తనను తాను సంస్కరించుకొని మారడానికి ఎంతో కాలం తపస్సు చేశారు. యోగ లక్షణాలతోనే జన్మించిన కారణ జన్ముడు గనుక, చిన్నప్పుడు కూడా ఏ కోరికలు కోరకుండా త్యాగభావంతో మెలిగారు. అందుచేత నిరంతరం ఈ విశ్వనాథ శాస్త్రి పట్ల దయదలచి భగవంతుడు చెంతనే నిలిచాడు. రాముడున్నాడు గనుక కాముడు పారిపోయినాడు. నిత్యనందాన్ని అనుగ్రహించేవాడు రాముడు. భౌతిక సుఖాన్ని ఆశించి క్షణికావేశంతో తాత్కాలికమైన సంతోషాన్ని అనుభవించే వారికి కనువిప్పు కలిగేలా విశ్వంజీ తమ స్వానుభవాన్ని ధ్వనింపజేస్తూ కాముణ్ణి తరిమి రాముణ్ణి ప్రతిష్ఠించుకోవాలని హెచ్చరించారు ఈ పద్యంలో. పూర్వజన్మల ప్రారబ్దాలు గురువు నాశ్రయిస్తే ఆ కర్మ ఫలాన్ని కరగించి వేసి మంచి మార్గాన్ని సూచిస్తూ ఆ దిశగా పయనించునట్లు అనుగ్రహించి ఆశీస్సు లిస్తుంటాడు. కాబట్టి గురువు పట్ల భక్తి విశ్వాసాలు పెంచుకొని వారి వాక్కు వేదవాక్కుగా భావించి వారి అడుగుజాడల్లో నడిచిననాడు రాముడు మనకు దక్కుతాడు, కాముడు దూరంగా పారిపోతాడు. గనుక గురువాజ్ఞను పాటించడం ధ్యేయంగా, లక్ష్యంగా భావిస్తూ ముందుకు సాగాల్సిందే. శ్రీకృష్ణ పరమాత్మ గీతలో ఈ విధంగా సెలవిచ్చాడు.

**శ్లో॥ తస్మాత్సర్వేషుకాలేషుమామనుస్మర యధ్యచ**
**మయ్యర్పిత మనోబుద్ధిః మమే వైష్యస్యసంశయమ్** (గీత 8-7)

ఈ గీతా వాక్యాన్ని మనఃస్మరణలో ఉంచుకోవాలి. "అన్ని సమయాల్లో నన్నే స్మరించు, స్మరిస్తూనే యుద్ధం చెయ్యి" అని అర్జునుణ్ణి ప్రోత్సహించాడు. మనస్సును, బుద్ధిని, నాకే అర్పించుకొన్న వాడవై నిశ్శంశయంగా నన్నే చేరతావు" అన్న భగవంతుడి అభయం అర్జునుడు యుద్ధం చేయగలిగేలా చేసి చివరకు

విజయం చేకూర్చింది. కామవాసనల్ని కాలు ద్రువ్వుచు నుండి కాల్చి వేయు నిన్నుగడ్డివోలె' –కామ వాసనల్ని తొలగించి గడ్డిపరకలా ఏరిపారవేసి, లేదా మంటతో ఆర్పివేస్తే మిగిలేది రామదర్శనమే. ఆయన ఉంటే కాముండుండడానికి ఏమాత్రం అవకాశం లేదు.

**చింతలన్ని బాపి చిత్తశుద్ధి నొసంగు**
**చిత్తమందు దానె చేరి యుండు**
**చిత్తచోరుడన్న చిత్రమేమియుగాదు**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥79)

మానవ జీవితమే చింతతో కూడుకొని ఉంది. చిత్తంలో తాను చేరి జతగానుంటే చిత్తశుద్ధిని కలుగజేస్తాడు. మానవుడు చేసే ప్రతి కర్మ మంచి కర్మ కావాలి. దానిని భగవదర్పిత భావంతో చెయ్యాలి. "చిత్తశుద్ధి లేని శివపూజలేలరా" అని వేమన పలికినట్లుగానే చిత్తం శుద్ధంగా లేని పూజలు దండగ. "పరశుద్ధమైన హృదయం పరమాత్మకు నిలయం" అన్నారు మహాత్ములు. "దయలేని హృదయం దయ్యాల కొంప" అన్నారు బాబా. ప్రతి వ్యక్తికి తోటి వారిపట్ల దయ, జాలి, కరుణ, ప్రేమ, వాత్సల్యం, కలిగియున్న వారి హృదయాలలో పరమాత్మ కొలువై ఉంటాడు. చిత్త చోరుడు భగవంతుడు చిత్తచోరా – అంటే ఆనందంగా ఊగుతాడట. ఇది బాబా ఉవాచ. చిత్త చోరాయశోదా కేబాల్; అని కృష్ణుణ్ణి స్తుతిస్తూ ఎలుగెత్తి పాడారు బాబా.

"మీ హృదయాలను దోచుకునే గజదొంగ ఆయనే" అంటూ ఒకానొక కృష్ణాష్టమి సందర్భంగా బాబా తమ దివ్యోపన్యాసంలో సెలవిచ్చారు. వెన్న దొంగ వెన్నదొంగ అంటూ ఇరుగు పొరుగువారు, గోపికలు, యశోద దగ్గర మొరపెట్టుకున్న సందర్భాన్ని ప్రస్తావిస్తూ బాబా "వెన్నదొంగేకాదు, హృదయాన్ని దోచుకుని దోబూచులాడే గజదొంగ. ధనధాన్య గో సంపదలన్నీ భగవంతుడు ప్రసాదించిన ఐశ్వర్యాలే గనుక అవి దొంగిలించవలసిన పని గాని, అవసరం గాని ఆయనకు లేదు. ఉన్నది లేకుండా చెయ్యడం, ఇంతమంది గోపికల హృదయాలు దోచుకున్నవాడు గనుకనే అందరి ఇండ్లల్లో ఒకే పర్యాయం ఆ ఒక్క రూపంతోనే ఏకకాలంలో దర్శనమివ్వడం వంటి లీలలు చూపుతూ వారి

భక్తి ప్రేమలకు కట్టుబడి చిత్తశుద్ధి కలిగియున్న వారి హృదయాల్ని దోచుకున్నవాడై, అదే సమయంలో తల్లిదగ్గరే ఉన్నట్లు ప్రతి చోట దర్శన మిచ్చిన మహనీయుడు, మాయావతారియైన శ్రీకృష్ణ పరమాత్మ భక్తుల హృదయాల్ని దోచుకున్నవాడై, భక్తవత్సలుడైనట్లే, బాబా ఈనాడు భక్త హృదయబంధితులైనారు. ఎందరెందరో భక్తులకు వారి ఇండ్లల్లో నడయాడినట్లు భౌతికంగా ఏకకాలంలో దర్శనమివ్వడం, అదే సమయంలో పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో వారి కార్యంలో వారు నిమగ్నులై ఉండడం భక్తుల అనుభవాల ద్వారా తెలియుచున్నది.

శ్రీ విశ్వంజీ జీవిత చరిత్ర పరిశీలిస్తే వారు కూడా భక్తుల ఇండ్లల్లో తిరిగిన దాఖలాలెన్నో ఉన్నాయి. సూక్ష్మ శరీరంతో అవతారమూర్తులు, యోగులు చిత్తశుద్ధితో ప్రార్థించిన వారి కోరికలు నెరవేర్చడానికి చిత్రంగా విచిత్రమైన విలక్షణమైన కోర్కెలు తీరుస్తారనడానికి ఇంతకంటే నిదర్శనమేమి అక్కరలేదు.

**నిద్రబద్ధకమ్ము నిజమగు శత్రువు**
**కోపమన్న కాలకూట విషము**
**విషయవాంఛలన్న విఱగని విషమురా**
**శాంతి ప్రేమదాయి! సత్యసాయి!** (శాం॥ప్రే॥75)

నిద్ర బద్ధకము తమో గుణానికి సంబంధించినది. దీనికి ప్రతీకగా త్రేతాయుగం నాటి కుంభకర్ణుడు మనకు గుర్తు వస్తాడు. తమోగుణము సాధకునకు విరుద్ధమయినదిగా చెప్పవచ్చును. రెండవది విషయ వాంఛలన్నీ కూడా అటువంటివే. కేవలం భౌతికమైన, లౌకికమైన వాంఛల్ని పెంపొందించుకుంటూ అదే లోకంగా భావిస్తూ ఆలోచిస్తుంటే కాముడున్న చోట రాముడుండన్నట్లుగానే భగవంతుణ్ణి దూరం చేసుకున్నట్లవుతుంది. లౌకిక వాంఛలు భౌతిక జీవితం మితంగా ఉండడం తప్పుకాదు, కాని అదే లోకంలో ఉంటూ అధ్యాత్మ సాధనకు దూరం కాకూడదన్నదే మహనీయులు ఉవాచ. ఇంక కోపం విషయానికొస్తే అది కాల కూట విషం వంటిది. విషయ వాంఛలు విఱుగని విషం వంటి వని విశ్వంజీ తెలియపరచారు.

నిరంతరం సాయినామాన్ని జపిస్తూ ఈ విషపూరితమైన కోరికల్ని, క్రోధాన్ని బయటకు తరమాలి. నిత్యం బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేవడం

నామ సంకీర్తనతో నగర సంకీర్తన కార్యక్రమం ఏర్పాటు చేయడం ద్వారా నిద్ర బద్ధకమనే శతృవును పారద్రోలారు బాబా. ఈనాడు ఊరూరా 'భజనలు, నగర సంకీర్తనలు ప్రతినిత్యం జరగడం వలన దివ్య వీచికలు (Divine Vibrations) అంతటా వీచేలా సాధనామార్గాన్ని అవలంబింపజేసిన బాబా వారి పట్ల కృతజ్ఞులై మెలగాలి.

విషయవాంఛల్ని విరిచేయాలంటే నామస్మరణయే సర్వశ్రేష్ఠము. అదే భక్తి ముక్తి దాయక మని చెప్పాలి. అనాది కాలం నుంచీ మన భారతదేశంలో నామస్మరణ ద్వారా తరించినవారున్నారు. అద్భుతమైన ఫలితాల్ని కూడా సాధించినారు. కబీర్‌దాస్, శబరి, మీరాబాయి, సక్కుబాయి, బైజాబాయి ఇంకా అనేకమంది తరించినారు. నిరంతరం రామనామాన్ని జపిస్తూ శరణాగతి భావంతో సేవించిన శబరి చిరస్మరణీయురాలు. ప్రహ్లాదుని నారాయణ మంత్రం నృశింహస్వామి ఆవిర్భావానికి కారణమయినది. కన్నప్ప భక్తితో శివనామం ద్వారా, అర్చన ద్వారా తరించి చిరస్మరణీయుడై కాళహస్తిలో కొండమీద చిరస్థాయిగా భక్తులకు దర్వనమిచ్చుచున్నాడు. నారదుని నామ సంకీర్తన ముల్లోకాల్ని తరింపజేసింది. దైవనామస్మరణ అసాధ్యాల్ని సుసాధ్యాలు చేస్తుంది. దీనికి నిదర్శనమే విషము కలిపిన పాలను త్రాగినప్పటికి విషము విఱిగి విషయమునెరుగునట్లు చేసినది. అందుచేతనే "విఱగని విషమునకు విరుగుడు సాయియేరా" అని హెచ్చరించారు విశ్వంజీ.

జగన్నాటక సూత్రధారికి తెలియనిదేమి లేదు. ధృవుడు తపః ప్రభావం చేతనే ధృవతారగా తరతరాల నుంచి చరిత్ర జ్ఞాపకముంచుకుంది. రత్నాకరుడను పేరుతో వ్యవహరింపబడిన బోయవాడు, దారులు కొడుతూ దొంగతనం చేసినవాడు, సప్తఋషుల సందర్శన భాగ్యం కలిగి వారి సాంగత్యం వలన మహాతపస్సు చేసి వాల్మీకి మహాకవియై రామాయణాన్ని వ్రాసి చరిత్రలో చిరస్థాయిగా నిలచినాడు.

(సశేషం)

***(కీ.శే. వి. రత్నమోహిని రచించిన విశ్వ హృదయార్చన నుండి సేకరణ)***

# ఆత్మబంధువు

## విశ్వగురుచరితామృతం

(గత సంచిక తరువాయి)

1985లో పూలకుండీ కాలుమీద పడి సుషుమ్నానాడీ చలనం కలిగి, శక్తిపాతం జరిగినప్పటి నుంచి మాస్టరు గారిలో అద్భుత పరిణామం వచ్చింది. సృష్టిలో దేన్ని చూచినా వారికి తానుగా కన్పించేది. సర్వం తనలో కనిపించేది. తనలో అన్నింటిని, అన్నింటిలో తననూ దర్శించే స్థితికి చేరుకున్నారు మాస్టరు గారు. "ఆత్మ వత్సర్వభూతాని" అన్నది అనుభవైక వేద్యమైంది. ప్రేమభావం ఉప్పొంగింది. ధోవతి కట్టి లాల్చీ వేసుకొని పైన ఉత్తరీయం వేసుకోవటం మొదలు పెట్టారు. స్కూల్లో తప్పితే ఎక్కువ కాలం మౌనంగా ఉండటం మొదలు పెట్టారు. రైలుపేట గదిలోనే రాత్రి సమయాన్ని ధ్యానంలో గడిపేవారు.

ఆ సమయంలో ఎంతోమంది సిద్ధపురుషులతో, యోగులతో, దివ్యులతో వారికి మానసిక సంబంధ మేర్పడింది. మాధవరామశర్మ గారిచ్చిన శ్రీచక్రాన్ని నిత్యం యధావిధిగా పూజిస్తుండేవారు. దత్తాత్రేయ మంత్రాన్ని అత్యంత నియమ నిష్ఠలతో జపించేవారు. ఇక మాలామంత్రమైతే అది వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలైంది. గురుచరిత్ర, సాయిబాబా జీవిత చరిత్ర మొదలైన యోగుల చరిత్రలు, భగవద్గీత, యోగానికి సంబంధించిన ఇతర గ్రంథాలు చదవటంతోనే సంతృప్తి పడక, అందలి విషయాలను అనుభవంలోకి తెచ్చుకొన్నారు.

రామకృష్ణ పరమహంసలా మాస్టరుగారు కూడా వివిధ మత గ్రంథాలు ఏమి చెబుతున్నవి? ఆయా మతాల ప్రత్యేకత ఏమిటి? మత మతానికీ వేరు వేరుగ ఇంతమంది దేవుళ్ళు ఉన్నారా? కాకపోతే అసలు ఏ మతానికి సంబంధించిన దేవుడు నిజమైన దేవుడు? భగవంతుడు ఒక్కడే అయినప్పుడు ఇన్ని మతాలెందుకు బయలుదేరినాయి? ఇత్యాది అనేక సందేహాలు కలిగి వివిధ మతగ్రంథాలను ఆయన చదివారు. ఖురాన్, బైబిల్, గ్రంథ సాహెబ్, భగవద్గీత, యోగవాశిష్టం మొదలైన గ్రంథాలు చదవటమే కాక ఆయా మతాల్లో

నిష్ణాతులైన తత్త్వవేత్తలను సందర్శించి, వాళ్ళతో చర్చించి ఎన్నో నూతన విషయాలు తెలుసుకున్నారు. "అన్ని మతాలు సత్యమైనవే. ఆయా కాలాల్లో, ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ధర్మాన్ని ప్రబోధించటం కోసం, అజ్ఞానాన్ని తొలగించటం కోసం, సుఖశాంతులతో సమాజాన్ని నింపటం కోసం, మనిషిని నిజమైన మనిషిగా తీర్చిదిద్ది దివ్యత్వం వైపు తీసుకొనిపోవడం కోసం ప్రవక్తలు జన్మించి మార్గాలను చూపించారు. ఆ మార్గాలనే ఈనాడు మతాలని మనం పిలుస్తున్నాం. ఏ ప్రవక్త చెప్పినా అదంతా సనాతన ధర్మంలోనిదే కాని క్రొత్తదేమీ కాదు. నదులకన్నింటికి ఆధారం సముద్రమైనట్లే ప్రవక్తల సిద్ధాంతాల కన్నింటికి ఆధారం సనాతన ధర్మమే"నని వారికి బోధపడింది.

అది ఆత్మవిశ్వాసం, ఆత్మనిష్ఠ, ఆత్మనిగ్రహం, ఆత్మానందం, ఆత్మ సాక్షాత్కారం అనే పంచసోపానాలు అధిరోహించటమే. ప్రతి వ్యక్తి మొట్టమొదట సాధించు కోవలసిందీ, పెంపొందించుకోవలసిందీ ఆత్మవిశ్వాసం. తన సాధన మీద, గురువు మీద, భగవంతుని మీద విశ్వాసం లేకపోతే ఆధ్యాత్మిక పురోభివృద్ధి కలుగదు. "మనుష్యుడు కారు వంటి వాడు. భగవంతుడు పెట్రోలు వంటివాడు. గురువు డ్రైవరు వంటివాడు. గురువు పర్యవేక్షణలో, భగవంతునిపై విశ్వాసంతో మనుష్యుడు జీవితాన్ని సఫలం జేసుకోవాలి" అంటూ ఈనాడు మాస్టరు గారు చెప్తున్న వాస్తవం ఆనాడు వారికి బోధపడిన తత్త్వమే.

1985లో జిల్లెళ్లమూడి అమ్మ దగ్గరకు వెళ్ళి వచ్చిం తరువాత మాస్టరు గారు ధ్యానంలో ఉండగా ఒక విచిత్రం జరిగింది. ఒక దిగంబరాంగన వారికి ప్రత్యక్ష మైంది. ఆ దివ్యసుందరి ఆయన్ను గాఢంగా కౌగిలించుకొని, శరీరమంతా ముద్దు పెట్టుకుంటూ, తన వాడి గోళ్ళతో శరీరాన్ని రక్కసాగింది నెత్తురోడేటట్లు. కాని మాస్టరు గారి ధ్యాననిష్ఠ సడల లేదు. ఆ రమణీమణి ఆయన్ను అంతరిక్షంలోకి తీసుకుపోయింది. ఎంత ప్రయత్నించినా మాస్టరుగారి ఏకాగ్రత చెదరక పోయేటప్పటికి, ఆయన జితేంద్రియత్వాన్ని మెచ్చుకొంటూ, దివ్యకిరీట వస్త్రాభరణ భూషితురాలై "నీ మనస్సు విశ్వమనస్సులో లగ్నమైంది. నీవు విశ్వయోగివైనావు" అని మాస్టరుగారిని ఆమె "విశ్వయోగి" అని సంబోధించింది. "నీ ఆత్మశక్తి దివ్యశక్తితో సంబంధం ఏర్పరచు కొంది. నీ మనస్సు విషయేచ్ఛలలో

ఇక ఏ మాత్రం తగుల్కోదని తేలింది. నా ఆకర్షణకెవరు లొంగరో వారికి నేను స్వాధీనమై, దత్తమౌతాను. నీకు దత్తమైన విశ్వశక్తిని నేను!" అని పలికి ఆమె విశ్వంజీలో కలిసి పోయింది. మాస్టరుగారు కళ్ళు తెరిచారు. శరీరమంతా ఆనందంతో పులకించి పోయింది. లోకమంతా కొత్తగా కనిపించసాగింది. సర్వత్రా తానే కనిపించటం మొదలు పెట్టింది. పాత జీవితం మరణించి కొత్త జీవితం ప్రభవించినట్లైంది. ఆనాటి నుండి మాస్టరు గారు "శ్రీ విశ్వయోగి విశ్వంజీ''గా నూతన జన్మమెత్తారు. ఆ దిగంబరి ఎవరో కాదు. దిగంబరావధూతయైన దత్తప్రభువు యొక్క శక్తి స్వరూపమే! ఆ దేవి నిర్దేశించిన కర్తవ్యాన్ని మూర్తీభవించిన చిచ్ఛక్తియై భక్తుల పాలిటి కామధేనువయ్యారు.

మాస్టరు గారు తమ స్వంత ఇంటికి పోవటం తగ్గించి, రైలుపేట గదిలోనే ఉంటూ తీవ్ర సాధన చేస్తున్న సమయంలో శ్రీ ఆకుల కోటేశ్వరరావు గారి ధర్మపత్ని శ్రీమతి ఈశ్వరి, తమ ఇంటి నుంచి క్యారియర్‌తో ఆహారం తెచ్చి, మాస్టరు గారికి ప్రేమ పూర్వకంగా తినిపిస్తుండేది. ఈశ్వరి పూర్వ జన్మలో ఎంత సుకృతం చేసుకున్నదో! మాస్టరు గారికి కన్న తల్లిలా ఆహారం చేతులారా పెట్టే మహాభాగ్యం పొందగలిగింది. ఈశ్వరి మాస్టరుగారిపై చూపించే ఆ మాతృవాత్సల్యం, ఆ భక్తి శ్రద్ధలూ చూచి, అంతా ఆమెను "యశోద" అని ముద్దుగా పిలిచేవాళ్ళు. ఆ పిలుపు విని ఆమె 'ధన్యోస్మి' అని పులకరించిపోయేది. ఇరవై ఒక్క సంవత్సరాల సుదీర్ఘ తీవ్రసాధనా ఫలితంగా, నైష్ఠిక బ్రహ్మచర్యం మూలంగా మాస్టరు గారికి మంత్రసిద్ధి కలిగింది. ఆత్మసాక్షాత్కారం లభించింది. విశ్వ మనస్సుతో తమ మనస్సును అనుసంధానం చేసి 'విశ్వయోగి' అయ్యారు. బ్రహ్మజ్ఞానం కలిగి దత్తస్వరూపంగా మారారు.

సిద్ధులూ, అవతార పురుషులూ, యోగులూ మొదలైన వాళ్ళంతా పూర్వాశ్రమంలో బండరాయిలాంటి వాళ్ళు. ఏ మహాత్ముడో వచ్చి, మంత్ర ప్రదానంవల్లనో, దివ్య కటాక్షంవల్లనో, సంకల్ప బలం వల్లనో శక్తిప్రదానం చేస్తే, ఆ బండరాళ్లు శక్తివంతమైన మహాత్ములుగా మారిపోవటం జరుగుతుంది. గత జీవితం పూర్వ జన్మలాంటిది. "శిల్పి బండరాతిని శిల్పంగా మార్చేటప్పుడు సుత్తి తీసుకొని ఉలిమీద ఒక దెబ్బ వేస్తాడు. ఆ దెబ్బకు ఆ రాతిలోంచి ఒక

పెచ్చు ఎగిరిపోతుంది. మళ్ళీ ఒక దెబ్బ వేస్తాడు. మరో పెచ్చు ఎగిరిపోతుంది. అట్లా తాను కోరుకున్న మూర్తి ఏర్పడేవరకూ, ఉలితో చెక్కుతూ, రాతి పెచ్చులను పగులకొడుతూనే ఉంటాడు శిల్పి. విగ్రహం ఏర్పడటానికి ఎంత కావాలో అంతమటుకే రాతిని వుంచి మిగతా రాయినంతా తీసేస్తాడు చెక్కి. ఆవిధంగానే గురువు తన శిష్యుణ్ణి శక్తి కేంద్రంగా, మహాత్ముడుగా, యోగిగా మలచడానికి అతనిలో గల పనికిరాని గుణాల నన్నింటిని క్రమక్రమంగా తీసి పారవేస్తుంటాడు" అని. శిష్యుడిలోని అసురీసంపదను సమూలంగా నాశనం చేస్తాడు. అట్లా కాకపోతే అతడు గురువే కాడు.

దత్తాత్రేయ గురుమహారాజ్‌చే మంత్రదీక్ష వహించి, యోగిరాజ్ శక్తిని దత్తం చేసుకున్న తర్వాత మాస్టరు గారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతమంది పరమ గురువులు, యోగులు, సిద్ధులు, దివ్యులు తమ తమ శక్తుల్ని ప్రసాదించారో, మనం ఊహించు కోవచ్చు. శ్రీ జమ్ములమడక మాధవరామ శర్మగారి ద్వారా శ్రీచక్రాన్ని ప్రసాదించి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి, తమ జన్మదినం నాడు కాలి బొటన వేలు చితికేటట్లు చేసి, సుషమ్నానాడి చలనం కలిగించి, కుండలినీ శక్తిని జాగృతం జేసిన శ్రీ సాయిబాబా, మూడు ముద్దలు తినిపించటం ద్వారా గ్రంథిత్రయ భేదనం జరిపించిన జిల్లెళ్ళమూడి అమ్మ మొదలైన వాళ్ళు ప్రత్యక్ష నిదర్శనంగా శక్తి ప్రసారం చేసినట్లు కనిపిస్తుంటే, పరోక్షంగా యాజ్ఞవల్క్యుడు, మైత్రేయుడు, మహా అవతార్ బాబాజీ, లాహిరీ మహాశయులు, రామకృష్ణ పరమహంస, షిర్డీ సాయినాథ్, వివేకానంద, మాస్టర్ సి.వి.వి., శ్రీధరస్వామి మహారాజ్, సమర్థ రామదాసు, రమణ మహర్షి, అరవిందులు, మాస్టర్ ఎక్కిరాల, జీసస్ క్రీస్తు, గురునానక్, రాధా స్వామి, మహమ్మద్ ప్రవక్త, ఆది శంకరులూ మొదలైన వాళ్ళెంత మందో తమ శక్తిని ప్రసాదించినట్లు కనిపిస్తున్నది. హిమాలయాల్లోంచి పరమ గురువులు పిలుస్తున్న పిలుపులు ఈనాడు మాస్టరు గారికి వినిపిస్తున్నవి. వాళ్ళ ఆహ్వానాన్ని పురస్కరించుకొని ఎప్పుడు మాస్టరు గారు వాళ్ళ దగ్గరకు వెళ్ళుతారో మరి? ఇందరు ఇన్నివిధాల తమ శక్తిని ధారపోసి వారి యోగసాధనకు సహకరించారు గనుకనే అచిరకాలంలో వారి సాధన ఫలించి చిచ్ఛక్తి స్వరూపంగా మారారు.

ఆయన శక్తికి ప్రతిరూపమై, గుహ్యాతిగుహ్యామై, పరమ శక్తివంతమైన "ఓం శ్రీ సాయిరాం గురుదేవదత్త" అనే మహామంత్రం ఈనాడు అనేకులకు మహాశక్తిని ప్రసాదిస్తున్నది. ఆ మంత్రాన్ని ఉపాసించి వేలాది మంది బాధా విముక్తులు కావటం, లబ్ధ మనోరథులు కావటం ఆయన సాక్షాత్తు శక్తి స్వరూపమని ఘంటాపథంగా వెల్లడిస్తున్నది.

**ఆత్మసాక్షాత్కారానికి అద్దం పట్టిన 'అనురాగలహరి'**

**"లహరిలోన మునుగ లభియించు తను శుద్ధి**
**రాగలహరి మదికి రక్తి నొసగు;**
**ఆత్మ పరవశించు "అనురాగలహరి"లో**
**సరసహృదయులైన సజ్జనులకు"** – – డాక్టరు కరుణశ్రీ

మాస్టరుగారు తమ సాధనా దశలో వ్రాసిన 'శాంతి ప్రేమదాయి' సాధనా రహస్యాలకు పెన్నిధి కాగా, వారు వ్రాసిన "అనురాగలహరి" వారి ఆత్మసాక్షాత్కారానికి అద్దం పడుతున్నది. మాస్టరుగారు రచించిన ఈ అమూల్య గ్రంథాలు రెండూ ఆస్తికులకు ఆవశ్య పఠనీయాలు. తమ "విశ్వకాంక్ష"లో శ్రీ జమ్మలమడక మాధవరామశర్మగారు చెప్పినట్లు "సాధకుని యొక్క సూక్ష్మదేహము భావస్థిరములైన జన్మాంతర సౌహృదయము లను ప్రసాదిస్తుంది. చిత్తాకాశము చిదాకాశ స్ఫురణము అందుకొంటే ఇట్లా జరుగుతుంది. వీణ పలుకుతుంది. పాట పాడుతుంది. బహిర్వీణలో గోచరించని విశేషాలు హృదయవీణలో ఉంటాయి. అవి సచేతనుల హృదయవీణలో పాటలు పుట్టించగలవు. ఈ ఉపాయలాభము ఉత్తమ మార్గము. శ్రీమాతృ శక్తి అజేయమని కవితాశక్తితో, సశక్తితో, రక్తితో విశ్వంజీ గుర్తించారు."

(సశేషం)

**(కీ॥శే॥ కె.నరసింహ, ఐ.పి.ఎస్. రిటైర్డ్ సంకలనం చేసిన 'ఆత్మబంధువు' నుండి సేకరణ)**

# ఉద్ధవగీత

ఉద్ధవుడు శ్రీకృష్ణుడుతో చిన్నతనం నుండి అనుసరిస్తూ అనేకమైన సేవలు చేస్తూ, అతనికి రథచోదకుడుగా వ్యవహరించాడు. అంత సమీపంగా ఉన్నా ఉద్ధవుడు ఎన్నడు శ్రీకృష్ణుడుని ఏమీ అడగలేదు ఏ వరము కోరుకోలేదు. అవతార సమాప్తి జరిగేముందు శ్రీకృష్ణుడు ఉద్ధవుడుతో అన్నాడు 'ఈ అవతారంలో నన్ను ఎంతమందో వరాలు కోరుకున్నారు, వాటిని పొందారు. కాని నీవు మాత్రం ఎప్పుడు ఏమి అడగలేదు. అందుచేత ఏదైనా కోరుకో తప్పక తీరుస్తాను, నీకు కూడా మంచిని చేసి నా అవతారాన్ని సంతృప్తిగా ముగిస్తాను' అని ఉద్ధవుడు చిన్నతనం నుండి శ్రీకృష్ణునితో మెలగినా తన గురించి ఏమి కోరుకోలేదు. కాని అతనికి కృష్ణుడు చెప్పేదానికి చేసేదానికి సంబంధము లేకపోవడం ఆశ్చర్యం కలిగించేది, అర్థమయేదికాదు. అందుకని కృష్ణున్ని అడిగాడు 'ప్రభూ మీరు మాకు ఎలా జీవనం సాగించాలో చెప్పారు కాని మీరు ఇంకో విధంగా జీవనం సాగించారు. మహాభారతం అనే నాటకంలో మీరు నిర్వహించిన పాత్ర, మీరు చేసిన కార్యములలో నాకు అనేక విషయాలు అవగతం కాలేదు, మీ లీలలు గురించి తెలుసుకోవాలని కుతూహలముగా ఉంది, నా కోరిక తీరుస్తారా'. దానికి శ్రీకృష్ణుడు 'ఉద్ధవా! కురుక్షేత్ర సంగ్రామంలో నేను అర్జునునికి బోధించినది 'భగవద్గీత', ఈనాడు నీకు నేను తెలిపేది 'ఉద్ధవగీత' అవుతుంది, అందుకనే నీకు ఈ అవకాశం ఇస్తున్నాను నిస్సంకోచంగా అడుగు' అని అన్నాడు.

ఉద్ధవుడు తనలో కలిగిన సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ప్రశ్నల రూపంగా అడగడం ప్రారంభించాడు.

'కృష్ణా, నిజమైన స్నేహితుడు అంటే ఎవరు' అని అడిగాడు.

'అడగకపోయినా వచ్చి అవసరం ఉన్న స్నేహితునికి సహాయం అందించేవాడు నిజమైన స్నేహితుడు' అని కృష్ణుడు అన్నాడు.

**ఉద్ధవుడు :** నీవు పాండవులకు ఆప్తమిత్రుడవు, వారు నిన్ను తమ ఆప్తభాంధవుడుగా విశ్వసించారు. నీకు ఏమి జరుగుతోందో, ఏమి జరగ

బోతోందో తెలుసు. నీవు మహాజ్ఞానివి. నిజమైన స్నేహితుడు ఎవరు అంటే చెప్పావు. మరి నీవు ఆ ప్రకారంగా ఎందుకు వ్యవహరించలేదు. ధర్మరాజుని జూదము ఆడకుండా ఎందుకు వారించలేదు. అది కాకపోతే ధర్మరాజు జూదంలో గెలిచేలా చేసి ధర్మము ఎప్పుడూ జయిస్తుందని ఋజువు చేయడానికి నీవు ఎందుకు పూనుకోలేదు. పోనీ తన సంపదని, రాజ్యమును, తనని జూదంలో ధర్మరాజు పోగొట్టుకున్నాక జూదమును అంతటితో ఎందుకు ఆపుచేయలేదు. అతడు తన సోదరులను పణంగా పెట్టి జూదం ఆడుతున్నప్పుడు నీవు వారించలేదు. ద్రౌపదిని పణంగా పెట్టి గెలిస్తే మొత్తం పోగొట్టుకున్నది తిరిగి ఇస్తాను అని ధుర్యోధనుడు ధర్మరాజును ప్రేరేపించినపుడు నీ దివ్యశక్తితో ధర్మరాజు గెలిచే విధంగా పావులు పడేలా చేయలేదు. ఆఖరకి ద్రౌపదిని సభలోకి తీసుకువచ్చి వస్త్రమును ఊడదీసేంతవరకు నీవు కల్పించుకోలేదు. కాని ఆమెకు వస్త్రాలను ఇచ్చి ఆమె శీలమును కాపాడానని చెప్తున్నావు. ఒక స్త్రీ యొక్క స్త్రీత్వమునకు భంగం కలిగినప్పుడు నీవు ఏమి రక్షించావు. నిజమైన స్నేహితుడిలా ఎందుకు చేయలేదు. అవసరమైప్పుడు ఆదుకొనకపోతే ఏమి ప్రయోజనం. ఇదేనా ధర్మం?

ఈ విధంగా మాటలాడడంతో ఉద్ధవుని కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ఈ ప్రశ్నలన్ని ఉద్ధవునకు మాత్రమే కలిగినవి కావు. సాధారణ మానవులు అందరికి కలిగే ప్రశ్నలు ఉద్ధవుని ద్వారా అడగబడినాయి.

శ్రీకృష్ణుడు నవ్వుతూ అన్నాడు 'ఈ లోకంలోని న్యాయం ఏమిటంటే వివేకం ఉన్నవాడే విజయం సాధిస్తాడు'. ధుర్యోధనుడు వివేకం కలవాడు, ధర్మరాజుకు అది లేదు. అందుకే ధర్మరాజు ఓడిపోయాడు. ధుర్యోధనుడికి జూదము ఆడడానికి తగినంత ఐశ్వర్యము, సంపద కలిగి ఉన్నా జూదము ఆడడం రాదు. అందుకని శకునిని తన బదులుగా ఆడమన్నాడు, పణం తను పెట్టాడు. అదే అతని వివేకం. అదే విధంగా ధర్మరాజు ఆలోచన చేసి తన బదులు నేను ఆడతాను అని చెప్పవచ్చు. అప్పుడు నేను, శకుని జూదము ఆడితే ఎవరు గెలుస్తారో తెలుసు కదా! సరి నన్ను ఆటలో పాల్గొనమని అడగటం మరచిపోవడం అన్న విషయం క్షమించగలను. కాని వివేకం లేకుండా ఇంకొక

తప్పు చేసాడు. నేను జూదం ఆడే భవనంలోకి రాకూడదని ప్రార్థించాడు. ఎందుకంటే దురదృష్టవశాత్తు అతను ఈ జూదం తప్పనిసరిగా ఆడవలసి వచ్చింది అనే విషయం నాకు తెలియకూడదు అనుకున్నాడు. అందుకని తన ప్రార్థనతో నన్ను కట్టిపడేసాడు, ఆ ప్రాంగణంలోనికి రాకుండా చేసాడు. ఎవరో ఒకరు తమని ఆదుకోమని కోరుకోరా అని వేచి ఉన్నాను. భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు వీరందరిని పందెంలో పోగొట్టుకున్నా అందరు ధుర్యోధనుడిని తిట్టుకున్నారు, తమ దురదృష్టం అనుకున్నారుగాని నన్ను పిలవడం మరచిపోయారు. ద్రౌపది కూడా దుశ్శాసనుడు తన జుట్టు పట్టుకుని సభలోకి లాక్కుని వచ్చినప్పుడు, సభలో తనకు జరుగుతున్న అన్యాయం గురించి ఆక్రోసించింది కాని నన్ను పిలవలేదు. దుశ్శాసనుడు ఆమెను వివస్త్రను చేయడం మొదలుపెట్టినప్పుడు ఆమె నన్ను అభయం కృష్ణా, అభయం అంటూ తనని రక్షించమని వేడుకుంది. అప్పుడు నాకు ఆమె స్త్రీత్వము భంగము కాకుండా రక్షించడానికి అవకాశము కలిగింది, ఆమెను కాపాడగలిగాను. అందుచేత ఈ జరిగిన దానిలో నా తప్పిదము ఏముంది చెప్పు ఉద్ధవా!'

'కృష్ణా, చాలా అద్భుతంగా ఉంది నీ వివరణ. నాకు ముచ్చట కలిగింది. అయినా నేను మాయలో పడను. ఇంకొక ప్రశ్న అడుగుతాను.' అన్నాడు ఉద్ధవుడు.

(సశేషం)

సేకరణ : **సూర్యారావు**

---

**అర్చనకాలే రూపగతా, సంస్తుతి కాలే శబ్దగతా ।**
**చింతన కాలే ప్రాణగతా, తత్వ విచారే సర్వగతా ॥**

**(ఉమాసహస్రమ్)**

పూజా సమయంలో 'రూపం' లోనూ, స్తోత్రం చేసేటప్పుడు 'శబ్దం' లోనూ, చింతన చేసేటప్పుడు 'ప్రాణం' లోనూ తత్త్వవిచార స్థితిలో 'సర్వత్రా' దైవం సాక్షాత్కరించును.

# గీతమంజరి

తే. చారు రూపరేఖావిలాసములవలన
నరుడు పూజ్యుండుగాఁడు గుణంబులేక
దర్శనీయమై యున్నను ద్రాఁచుపాము
నెవ్వఁ డేనియుఁ దరిఁజేర్ప నెంచునొక్కొ.

మిరెపకాయలు కడుపార మెక్కి మెక్కి
కూయుచుండును హాయిగా గోరువంక
వెన్న మీగడల్ దిని పాలుపేరుగుఁ ద్రావి
కర్ణకటువుగా నఱచును గండుపిల్లి.

ఎంత తేజోధనుండైన నించుకంత
పరసహాయంబుఁ బడయక ప్రబలలేఁడు;
అగ్నిహోత్రుఁడు తేజస్వి యగునుగాక
యెండుపుల్లలఁ గలియక నుండునొక్కొ.

ఎంతమేథావి యైనను నించుకంత
గురునిశిక్షను బడయక కుదురుపడఁడు
వజ్ర మెంతటివెలలేనివస్తు వైన
సానఁబెట్టక మెఱయునే స్వయముగాను.

**(కీ॥శే॥ చిలకమర్తి నరసింహము గారు రచించిన 'గీతమంజరి' నుండి సేకరణ)**